teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 308 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శుక్రవారం | 21 మార్చి 2025 | పేజీలు : 08 | వెల 5
Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## టీమిండియాకు బీసీసీఐ 58 కోట్ల నజరానా ప్రకటన


02


02

### నక్సలైట్లపై క్రూరమైన విధానంతో సాగుతోంది సర్కార్

మార్చి 31 నాటికి నక్సల్ రహితంగా దేశం మారుతుంది

హెూంమంత్రి అమిత్ షా


02

### ఉపాధి అవకాశాలు కల్పించడమే మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశం

మంత్రి జూపల్లి కృష్ణారావు

02

### ఓయూ పరిధిలో బీసీఏ పరీక్షా తేదీలు ఖరారు

కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ వెల్లడి



# నేటి నుంచి పది పరీక్షలు



## రాష్ట్రంలో హాజరుకానున్న 5,09,403 విద్యార్థులు

- పరీక్షల విభాగం కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- ముందుగానే పరీక్ష్యా కేంద్రాలకు చేరుకోవాలని సూచనలు
- 5 నిమిషాల పాటు ఉండనున్న గ్రేస్ పీరియెడ్
- స్మార్ట్ వాచ్, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి నిరాకరణ

02

తెలంగాణలో నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 4వ తేదీ వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. ఇప్పటికే అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 11,547 పాఠశాలల నుంచి 5,09,403 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వారిలో అబ్బాయిలు 2,58,895 మంది, అమ్మాయిలు 2,50,508 మంది ఉన్నారు.

# సంచలనంగా బెట్టింగ్ యాప్స్ వ్యవహారం

ప్రమోట్ చేస్తున్న సినీ హీరోలు కేసులు నమోదు

రానా, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మీ, ప్రకాష్ రాజ్ లుగా గర్తింపు



హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్): బెట్టింగ్ యాప్స్ వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. గత కొద్ది రోజులుగా ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ బెట్టింగ్ యాప్స్ పై వరుస పోస్టులు చేస్తూ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇప్పటికే భయ్యా సందీప్, హర్ష సాయి పై కేసులు నమోదు అయిన విషయం తెలిసిందే. అలాగే బెట్టింగ్ యాప్స్ ప్రమోట్

మిగతా 2 లో

# సూర్యాపేట వేదికగా కేటీఆర్ కీలక ప్రకటన

అధికారమే లక్ష్యంగా పాదయాత్ర చేస్తున్నట్లు వెల్లడి

ఇందుకోసం ప్రణాళికను సిద్ధం చేసినట్లు సమాచారం



సూర్యాపేట, మార్చి 20 (తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా వేదికగా మాజీ మంత్రి కేటీఆర్ కీలక ప్రకటన చేశారు. బీఆర్ఎస్ అధికారమే లక్ష్యంగా పాదయాత్ర చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం ప్రణాళికను సిద్ధం చేసినట్లు చెప్పారు. సూర్యాపేటలో గురువారం బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

మిగతా 2 లో

# మహిళలను అసభ్యకరంగా చూపించే డ్యాన్స్‌లపై ఆదేశాలు

తెలుగు సినిమాలపై మహిళ కమిషన్ సీరియస్

డ్యాన్స్‌లు అసభ్యకరంగా ఉన్నాయంటూ వాఖ్యలు

టాలీవుడ్ నిర్మాతలతో పాటు దర్శకులను, హీరోలకు హెచ్చరికలు



తెలంగాణ బ్యూరో, మార్చి 20 (తీన్మార్ న్యూస్): ఒకవైపు తెలుగు సినిమా రేంజ్ వరల్డ్ వైడ్‌గా పాకుతుంటే మరోవైపు సినిమాలలో అవసరం లేని సన్నివేశాలతో పాటు హీరోయిన్ డ్యాన్స్‌లు అసభ్యకరంగా ఉన్నాయంటూ తెలంగాణ మహిళ కమిషన్ సీరియస్ అయ్యింది. మహిళలను

మిగతా 2 లో

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలి



కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా

టీబీజేపీ నేతలకు సూచనలు

తెలంగాణ బ్యూరో, మార్చి 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఉత్సాహంగా పనిచేయాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా

మిగతా 2 లో

# అభివృద్ధి చేసినందుకే నాపై ప్రజలు కోపంగా ఉన్నారా..?

నా మీద వ్యతిరేకత వచ్చిందని దుష్ప్రచారం

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్): నా మీద వ్యతిరేకత వచ్చిందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి చేసినందుకే నాపై ప్రజలు కోపంగా ఉన్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో కొలువుల పండగ కార్యక్రమం నిర్వహించింది. పంచాయితీరాజ్, గ్రామీణభివృద్ధి శాఖలో కార్యుణ నియామకాల్ని చేపట్టింది. ఎంపికైన 922 మందికి కారుణ్య నియామక పత్రాలు అందించింది. ఈ సందర్భంగా

మిగతా 2 లో





# కేంద్ర మంత్రి బండి సంజయ్ కు హైకోర్టులో భారీ ఊరట

కేసును కొట్టేసిన హైకోర్టు

హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్): కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. బండి సంజయ్ పై నమోదైన కేసును హై కోర్టు కొట్టేసింది. గత జీహెచ్ఎంసీ ఎన్నికల సమయంలో ప్రచారం వేళ బండి సంజయ్ పై కేసు నమోదు అయ్యింది. కార్యకర్తల భేటీలో భాగంగా బండి సంజయ్ మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడారని కొందరు వ్యక్తులు

మిగతా 2 లో


# బెట్టింగ్ యాప్స్ వివాదంపై స్పందించిన కేఏ పాల్

ప్రమోట్ చేస్తున్న వారిపై కేసులు పెట్టడం మంచి పరిణామం

ప్రమోషన్ కారణంగా అమాయకులు బలవుతున్నారు

హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్): బెట్టింగ్ యాప్స్ వివాదంపై ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ స్పందించారు. హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న హీరోలు, హీరోయిన్ల మీద కేసులు పెట్టడం మంచి పరిణామం అన్నారు. కోట్లు తీసుకొని బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేయడం ఏంటి? అని ప్రశ్నించారు. వీళ్ళ ప్రమోషన్ కారణంగా అమాయకులు బలవుతున్నారని మండిపడ్డారు. మీరు వందల కోట్లు సంపాదించు కుంటు న్నారని మీరు సంపాదించుకున్న సంపాదనను కనీసం చారిటీల ద్వారా ఖర్చు

మిగతా 2 లో



# గద్దర్ అవార్డులు ఇవ్వనున్నట్లు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రకటన

వచ్చే నెలలో భారీ ఎత్తున అవార్డుల ప్రదానం



హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్): తెలుగు చిత్ర పరిశ్రమను ప్రోత్సహించేందుకు గద్దర్ అవార్డులు ఇవ్వనున్నట్లు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రకటించిన సంగతి తెలసిందే. వచ్చే నెలలో భారీ ఎత్తున ఈవెంట్ ను నిర్వహించి

మిగతా 2 లో

# ఏప్రిల్ 1 నుంచి యూపీఐ యాప్‌పై కొత్త నిబంధనలు


యాక్టివ్ గా లేకపోతే బ్యాంకు ఖాతాల నుంచి తొలగింపే




తెలంగాణ బ్యూరో, మార్చి 20 (తీన్మార్ న్యూస్): గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి యూపీఐ యాప్ లను ప్రభావితం చేసే కొత్త నిబంధనలను 2025 ఏప్రిల్ 1 నుంచి తీసుకురానుంది. యూపీఐతో లింక్ అయిన మొబైల్ నంబర్లు ఎక్కువ కాలం

మిగతా 2 లో

# నేటి నుంచి 'పది' పరీక్షలు




తెలంగాణ బ్యూరో, మార్చి 20 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 4వ తేదీ వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. ఇప్పటికే అధికారులు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 11,547 పాఠశాలల నుంచి 5,09,403 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వారిలో అబ్బాయిలు 2,58,895 మంది, అమ్మాయిలు 2,50,508 మంది ఉన్నారు. ఈ మేరకు అధికారులు 2,650 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పరీక్ష నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్స్ ను అధికారులు ఇప్పటికే విడుదల చేశారు. ఈ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడం కోసం ప్రభుత్వ పరీక్షల విభాగం కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసింది. విద్యార్థులకు ఏమైనా సందేహాలు, సమస్యలుంటే 040-23230942 నెంబర్‌ను సంప్రదించాల్సి ఉంటుంది. అలాగే, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్ష జరిగే సమయంలో ఆ చుట్టు పక్కల జిరాక్స్ సెంటర్లు మూసేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇక ట్రాఫిక్, ఇతర సమస్యలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని అధికారులు సూచించారు. అలాగే విద్యార్థులకు 5 నిమిషాల గ్రేస్ పీరియడ్ ఉంటుందని తెలిపారు. స్మార్ట్ వాచ్, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు కేంద్రంలోకి అనుమతి లేదు. ఒత్తిడికి లోనవకుండా విద్యార్థులకు పరీక్ష రాసేలా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. ఇక గతంలో పదో తరగతి విద్యార్థులకు 11 పేపర్లు ఉండేవి. ఈ సంవత్సరం నుంచి ఏడు పరీక్షలు మాత్రమే నిర్వహిస్తున్నారు. ఫిజికల్స్ సైన్స్, బయోలజీ పేపర్లను వేర్వేరు రోజుల్లో నిర్వహించనున్నారు.

ఈ రెండు పరీక్షలు ఒక్కో పేపర్ గంటన్నర వ్యవధిలో రాయాల్సి ఉంటుంది. ఇక సమాధానాలు రాసేందుకు క్యూఆర్ కోడ్‌తో ముద్రించిన 24 పేజీలతో సన్నని లైన్లతో కూడిన బుక్‌లెట్ ఇవ్వనున్నారు.

## ఓయూ పరిధిలో బీసీఏ పరీక్షా తేదీలు ఖరారు

### కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ వెల్లడి




హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్): ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీసీఏ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ రెండు, నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల మూడవ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

**వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలు విడుదల**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ రీవాల్యుయేషన్ ఫలితాలతో పాటు ఎం ఫార్మసీ (పీసీఐ) మొదటి, రెండు, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

**పీజీ డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం**

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పీజీ డిప్లొమా ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 25వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.


## అభివృద్ధి చేసినందుకే నాపై ప్రజలు కోపంగా ఉన్నారా..?

మొదటి పేజీ తరువాయి




రేవంత్ మాట్లాడుతూ గత పాలకులు పదేళ్లుగా ఈ నియామకాలు చేపట్టలేదు. కానీ తమ ప్రభుత్వం కారుణ్య నియామకాల్ని చేపట్టింది. నామీద వ్యతిరేకత వచ్చిందని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలు నాపై కోపంగా ఎందుకు ఉంటారు? మహిళలకు ఉచిత బస్సు కల్పించినందుకా? నాపై కోపం? ఉద్యోగాలు ఇచ్చినందుకా నాపై కోపం? రుణమాఫీ చేసినందుకా నాపై కోపం? 59వేల మంది ఉద్యోగాలు ఇచ్చినందుకా? నాపై కోపం అని ప్రశ్నించారు. అనంతరం బిల్డ్ నౌ పోర్టల్‌ను ఆవిష్కరించారు.

## నక్సలైట్లపై క్రూరమైన విధానంతో సాగుతోంది సర్కార్



న్యూ ఢిల్లీ, మార్చి 20 (తీన్మార్ న్యూస్): నక్సలైట్లపై నరేంద్ర మోడీ ప్రభుత్వం క్రూరమైన వైఖరితో ముందుకు సాగుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అన్ని సౌకర్యాలు అందిస్తున్నప్పటికీ లొంగిపోని తీవ్రవాదుల పట్ల ప్రభుత్వం జీరో-టాలరెన్స్ విధానాన్ని అవలంబిస్తోందని షా అన్నారు. సోషల్ మీడియా పోస్ట్‌లో, నక్సల్ ముక్త్ భారత్ అభియాన్ దిశలో సైనికులు ఈ రోజు మరో పెద్ద విజయాన్ని సాధించారని షా అన్నారు. వచ్చే ఏడాది మార్చి 31 నాటికి దేశం నక్సల్ రహితంగా మారబోతోందని ఆయన అన్నారు.

## ఉపాధి అవకాశాలు కల్పించడమే మిస్ వరల్డ్ పోటీల ఉద్దేశం



హైదరాబాద్, మార్చి 20 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర ఆదాయం పెంచి తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి పరిచయం చేయడం నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే మిస్ వరల్డ్ పోటీల ప్రధాన ఉద్దేశం అని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వచ్చే మే నెలలో హైదరాబాద్ వేదికగా 72వ మిస్ వరల్డ్ పోటీలు జరగబోతున్నాయి. ఈ పోటీల నిర్వహణ ఏర్పాట్లపై హైదరాబాద్ లో గురువారం మంత్రి జూపల్లి కృష్ణారావు మీడియాతో మాట్లాడారు. అందాల పోటీని మహిళా సాధికారత కోణంలో చూడాలని మిస్ వరల్డ్ పోటీలపై ప్రతిపక్షాలు చేసే విమర్శలు పట్టించుకోకుండా పాజిటివ్ కోణంలో చూడాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా 140 దేశాల నుంచి ఈ మిస్ వరల్డ్ పోటీలకు హాజరవుతున్నారని అంతర్జాతీయ మీడియా ఈ ఈవెంట్ కు వస్తుందన్నారు. తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడానికి ఈ ఈవెంట్ ఉపయోగపడుతుందన్నారు. గడిచిన పదేళ్లుగా రాష్ట్రంలో టూరిజం పాలసీ లేదని దాంతో టూరిజంలో రాష్ట్రానికి ఆదాయం లేదని విమర్శించారు. ప్రభుత్వం టూరిజాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగానే మిస్ వరల్డ్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలి

మొదటి పేజీ తరువాయి

టీబీజేపీ నేతలకు సూచించారు. గురువారం పార్లమెంట్ భవనంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ఎంపీలు, కొత్తగా ఎంపికైన ఇద్దరు ఎమ్మెల్సీలు, ఇతర సీనియర్ నాయకులు అమిత్ షాను కలిశారు. ఇటీవల ఎమ్మెల్సీలుగా ఎన్నికైన మల్క కొమురయ్య, అంజిరెడ్డిని అమిత్ షా అభినందించారు. ఈ భేటీలో కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, రఘునందన్‌రావు, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డా.కె.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. అయితే పార్టీలో ప్రస్తుతం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎవరనే దానిపై జోరుగా చర్చ జరుగుతోంది.

ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ పరిణామాలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ విజయంతో కాషాయపార్టీలో జోష్ కనిపిస్తోంది. ఈ జోష్‌ను కంటిన్యూ చేసేలా కొత్త అధ్యక్షుడి పేరును పార్టీ పెద్దలు అనౌన్స్ చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారనే చర్చ జరుగుతోంది. అయితే వచ్చే నెల 18-20 తేదీలలో బెంగళూరులో బీజేపీ కౌన్సిల్ మీటింగ్ జరగబోతున్నది. ఈ సమావేశం తరువాతే కొత్త అధ్యక్షుడి పేరు ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## సూర్యాపేట వేదికగా కేటీఆర్ కీలక ప్రకటన

మొదటి పేజీ తరువాయి



నిర్వహించింది. ఈ సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. వచ్చే ఏడాది పాదయాత్ర బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యం. సూర్యాపేటలో జనాల్ని చూస్తుంటే పెద్ద బహిరంగ సభకే వచ్చినట్లుంది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ దే అధికారం అని ధీమా వ్యక్తం చేశారు.

**మరోసారి కేసీఆరే సీఎం**

అంతకుముందు బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. మరోసారి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర బడ్జెట్‌పై ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో పథకాల అమలుకు సంబంధించి నిధుల కేటాయింపు లేదు. రుణమాఫీ చేశారో లేదో సీఎం రేవంత్‌రెడ్డి సొంత ఊరికి వెళ్లి అడుగుదాం. తెలంగాణ ధనం అంతా రాహుల్, సోనియా, ప్రియాంకా గాంధీ ఖాతాలో పడుతున్నాయి. ధాన్యం దిగుమతిలో తెలంగాణలో నల్లగొండను నంబర్ వన్ చేశారు కేసీఆర్.

**ఎస్ఎల్‌బీసీలో విషాదం.. చేపల కూర తింటున్న మంత్రులు**

ఎస్ఎల్‌బీసీలో విషాదం జరిగితే మంత్రులు చేపల కూర తింటున్నారు. ఓ మంత్రి నీళ్లు, వాటర్ కలిశాయని అంటున్నారు. గాడిదలను చూస్తేనే గుర్రాల విలువ తెలుస్తుంది. కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణకు శత్రువులే. కేసీఆర్‌పై ద్వేషంతో జిల్లాలో పంటలకు నీళ్లు ఇవ్వడం లేదు. కాలం తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తీసుకొచ్చిన కరువు ఇది. చెరువులు నింపితే బోర్లు ఎందుకు ఎండిపోతాయి. రేవంత్‌కు వ్యతిరేకంగా కిషన్ రెడ్డి, బండి సంజయ్, బీజేపీ ఒక్క మాట మాట్లాడదు. ఏం మాట్లాడకముందే జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేశారు. అసెంబ్లీని గాంధీభవన్ అన్న మజ్లిస్ సభ్యులపై చర్యలు తీసుకునే దమ్ము లేదా? అని ప్రశ్నించారు.

## మహిళలను అసభ్యకరంగా చూపించే డ్యాన్స్ లపై ఆదేశాలు


మొదటి పేజీ తరువాయి



తక్కువ చేసి చూపించే డ్యాన్స్ స్టెప్పులను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. తమ ఆదేశాలను పట్టించుకోకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని టాలీవుడ్‌కు చెందిన నిర్మాతలతో పాటు దర్శకులను, హీరోలను హెచ్చరించింది. ఇటీవల వచ్చిన రవితేజ మిస్టర్ బచ్చన్ సినిమాతో పాటు బాలకృష్ణ డాకు మాహారాజ్, నితిన్ రాబిన్ హుడ్ సినిమాలలో డ్యాన్స్ స్టెప్స్ అసభ్యంగా ఉండటంతో పాటు మహిళలను కించపరిచే విధంగా ఉన్నాయని మహిళా కమిషన్‌కు పలు ఫిర్యాదులు అందాయి. దీనిపై మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద గురువారం స్పందిస్తూ సినిమా అనేది సమాజంపై గాఢ ప్రభావం చూపగల ఒక శక్తిమంతమైన సాధనమని అన్నారు. సినిమాల్లో మహిళలను అవమానకరంగా, అశ్లీలంగా చిత్రీకరించే అంశాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆమె వ్యాఖ్యానించారు. ఈ సందర్భంలో దర్శకులు, నిర్మాతలు, కొరియోగ్రాఫర్లు మరియు సంబంధిత ఇతర వర్గాలు బాధ్యతాయుతమైన వైఖరి ప్రదర్శించాలని ఆమె సూచించారు. మహిళలను తక్కువ చేసి చూపే నృత్య రీతులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనట్లయితే తగిన చర్యలు తీసుకోక తప్పదని ఆమె హెచ్చరించారు. సినిమా రంగం సమాజానికి సానుకూల సందేశాలను అందించడం, మహిళల గౌరవాన్ని కాపాడటం అనేది నైతిక బాధ్యత. యువత, పిల్లలపై సినిమాలు చూపించే ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని, సినిమా పరిశ్రమ స్వీయ నియంత్రణ పాటించాల్సిన అవసరం ఉంది. ఈ అంశంపై ప్రజలు, సామాజిక సంస్థలు తమ అభిప్రాయాలను, సూచనలను మహిళా కమిషన్‌కు పంపవచ్చు. దీనిపై లోతుగా చర్చించి తగిన చర్యలు చేపడతామని మహిళా కమిషన్ ఒక ప్రకటనలో తెలిపింది.

## బెట్టింగ్ యాప్స్ వివాదంపై స్పందించిన కేఏ పాల్

మొదటి పేజీ తరువాయి



చేయాల్సిందన్నారు. మీకు ఎందుకు ఇంత కక్కుర్తి అని మండిపడ్డారు. ఇలాంటి పనులు చేసి ఇబ్బందుల్లో పడకండని యువతకు సూచించారు. వాస్తవానికి తెలంగాణాలో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన సెలబ్రిటీలపై ఉచ్చుబిగుస్తోంది. చిన్న వాళ్ల నుంచి పెద్ద సెలబ్రెటీల వరకు అందరిపై కేసులు నమోదవుతున్నాయి. ఇటీవల ఈ అంశంపై సజ్జనార్ కూడా స్పందించిన విషయం తెలిసిందే. "బెట్టింగ్ యాప్ లతో ఎంతో మంది యువత జీవితాలను నాశనం చేసి కోట్లలో సంపాదించి వేలల్లో పంచుతూ సంఘసేవ చేస్తున్నట్లు పోజులు కొడుతున్న ఇలాంటి వాళ్లనా మీరు ఫాలో అవుతుంది. వీరి స్వార్థం వల్లే బెట్టింగ్ సమాజంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. భారత ఆర్థిక వ్యవస్థను కూడా దెబ్బతీస్తోంది. అసలు ఏం ఉద్ధరించారు వీళ్లు. ఏమైనా దేశ సేవ చేస్తున్నారా? సమాజహితం కోసం ఏమైనా మంచి పనులు చేస్తున్నారా? ఇప్పటికైనా ఇలాంటి సైబర్ టెర్రరిస్టులను అన్ ఫాలో కొట్టండి. వారి అకౌంట్ లను రిపోర్ట్ చేయండి. ఎవరైనా బెట్టింగ్ యాప్ ల వల్ల నష్టపోతే సమీపంలోని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయండి. అని ఆయన సూచించారు.



## టీమిండియాకు బీసీసీఐ 58 కోట్ల నజరానా ప్రకటన

న్యూ ఢిల్లీ, మార్చి 20 (తీన్మార్ న్యూస్): 2025 ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న తర్వాత భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) గురువారం టీం ఇండియాకు 58 కోట్ల రూపాయల నగదు బహుమతిని ప్రకటించింది. ఈ ఆర్థిక గుర్తింపు ఆటగాళ్లు, కోచింగ్ మరియు సహాయక సిబ్బంది మరియు పురుషుల ఎంపిక కమిటీ సభ్యులను గౌరవిస్తుందని బిసిసిఐ తెలిపింది. రోహిత్ శర్మ నేతృత్వంలోని మెన్ ఇన్ బ్లూ జట్టు టోర్నమెంట్ అంతటా అజేయంగా నిలిచింది మరియు మార్చి 9న దుబాయ్‌లో వారి మైదాన ప్రత్యర్థి న్యూజిలాండ్‌తో జరిగిన ఫైనల్‌లో 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. నగదు బహుమతి గురించి మాట్లాడుతూ, బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ మాట్లాడుతూ, వరుసగా ఐసీసీ టైటిళ్లను గెలుచుకోవడం చాలా ప్రత్యేకమైనదని, ఈ బహుమతి ప్రపంచ వేదికపై టీమ్ ఇండియా అంకితభావం మరియు నైపుణ్యాన్ని గుర్తిస్తుందని అన్నారు. బోర్డు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా కూడా భారత క్రికెట్ నైపుణ్యం, మానసిక దృఢత్వం మరియు గెలిచే మనస్తత్వం అనే బలమైన పునాదిపై నిర్మించబడిందని చెబుతూ జట్టును ప్రశంసించారు.

## సంచలనంగా మారిన బెట్టింగ్ యాప్స్ వ్యవహారం

మొదటి పేజీ తరువాయి

చేస్తున్న విష్ణు ప్రియ, యాంకర్ శ్యామల, రితూ చౌదరి లాంటి యాక్టర్స్ తో పాటు మరి కొంతమంది పై పంజాగుట్ట పోలీసులు ఇటీవల కేసులు నమోదు చేశారు. తాజాగా మియాపూర్ పోలీసులు మరో అడుగు ముందుకు వేశారు. బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేస్తున్న సినీ హీరోలు దగ్గుబాటి రానా, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రకాష్ రాజ్, ప్రణీత, నిధి అగర్వాల్ లపై మియాపూర్ పోలీసులు బుధవారం రోజున కేసులు నమోదు చేశారు. వారి పై ఎఫ్ఐఆర్ నెంబర్ 393/2025 కింద కేసులు నమోదు కాగా సెక్షన్లు 318 (4) 112, రెడ్ విత్ 49 బీఎన్ ఎస్ 3,3(ఏ) 4, టీఎస్ జీఏ,66-డి ఐటీఏ 2000-2008 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

## ఏప్రిల్ 1 నుంచి యూపీఐ యాప్ పై కొత్త నిబంధనలు

మొదటి పేజీ తరువాయి

యాక్టివ్ గా లేకపోతే వాటిని బ్యాంకు ఖాతాల నుంచి తొలగిస్తామని నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. అంటే, ఒకవేళ, మీ బ్యాంక్ అకౌంట్ కు ఇన్ యాక్టివ్ గా మొబైల్ నెంబర్ లింక్ అయి ఉంటే, ఆ బ్యాంక్ అకౌంట్ తో అనుసంధానమై ఉన్న యూపీఐ యాప్స్ పని చేయవు.

**ఈ కొత్త నిబంధనను ఎందుకు తీసుకొచ్చారు?**

రోజురోజుకూ సైబర్ క్రైమ్ కేసులు పెరుగుతుండటంతో ఎన్ పీసీఐ ఈ నిర్ణయం తీసుకుంది. ఇన్ యాక్టివ్ మొబైల్ నంబర్లు బ్యాంకింగ్, యూపీఐ వ్యవస్థల్లో సాంకేతిక లోపాలను సృష్టిస్తున్నాయని పేర్కొంది. టెలికాం ప్రొవైడర్లు ఈ నంబర్లను వేరొకరికి తిరిగి కేటాయిస్తే, ఇది మోసానికి వీలు కల్పిస్తుంది. అందువల్ల, యుపిఐ లావాదేవీలను సులభంగా నిర్వహించడానికి యాక్టివ్ గా ఉన్న మొబైల్ నంబర్ అవసరం. అలాగే, ఆ నంబర్ ను మీ బ్యాంక్ ఖాతాకు లింక్ చేసి ఉండాలి.

**యాక్టివ్ గా ఉందో, లేదో చూసుకోండి.**

సాధారణంగా, నిర్దిష్ట కాలం పాటు రీ చార్జ్ చేయని మొబైల్ నంబర్లను టెలికాం ప్రొవైడర్లు డీ యాక్టివేట్ చేస్తారు. ఆ తరువాత, కొంత కాలం తరువాత వాటిని వేరే కస్టమర్లకు కేటాయిస్తారు. ఒకవేళ, ఆ నంబర్ గత కస్టమర్ కు చెందిన బ్యాంక్ ఖాతాలో లింక్ అయి ఉంటే, ఆ వ్యక్తి సైబర్ మోసానికి గురయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల, కస్టమర్లు తమ బ్యాంక్ ఖాతాలతో లింక్ అయి ఉన్న మొబైల్ నంబర్లను యాక్టివ్ గా ఉండేలా చూసుకోవాలి. ఒకవేళ, తమ మొబైల్ నంబర్ యాక్టివ్ గా ఉందో, లేదో తెలుసుకోవడానికి సంబంధిత టెలికాం ప్రొవైడర్ను సంప్రదించాలి. ఇన్ యాక్టివ్ మొబైల్ నంబర్ల రికార్డులను ప్రతి వారం సవరించాలని బ్యాంకులు, యూపీఐ అప్లికేషన్లకు ఎన్ పీసీఐ సూచించింది.

## గద్దర్ అవార్డులు ఇవ్వనున్నట్లు రేవంత్ రెడ్డి సర్కార్ ప్రకటన



మొదటి పేజీ తరువాయి

అవార్డులను ప్రదానం చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఈ నేపథ్యంలో గద్దర్ అవార్డులపై తెలుగు చలనచిత్ర నిర్మాతల మండలి స్పందించింది. గద్దర్ అవార్డులు ప్రదానం చేస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎఫ్డీసీ చైర్మన్ దిల్ రాజ్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ మేరకు తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ గౌరవ కార్యదర్శి టి. ప్రసన్న కుమార్ గురువారం ప్రకటన విడుదల చేశారు. 2024 సంవత్సరానికి గాను ఉత్తమ చలన చిత్రాలకు, ఉత్తమ్ కళాకారులు, సాంకేతిక నిపుణులకు తెలుగు చలన చిత్రం పరిశ్రమలోని ప్రముఖులు, గొప్ప వ్యక్తులైన ఎన్టీఆర్, పైడి జైరాజ్, బి.ఎన్. రెడ్డి, నాగిరెడ్డి, చక్రపాణి, కాంతారావు, రఘుపతి వెంకయ్య పేర్ల మీద "గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్" ను ప్రదానం చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## కేంద్ర మంత్రి బండి సంజయ్ కు హైకోర్టులో భారీ ఊరట

మొదటి పేజీ తరువాయి



ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై సికింద్రాబాద్ మార్కెట్ పోలీసులు కేసు నమోదు చేసి, ఛార్జ్ షీట్ కూడా దాఖలు చేశారు. అయితే దీనిపై గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ కేసులో కేంద్రమంత్రి తరపు న్యాయవాది మాట్లాడుతూ బండి సంజయ్ మత విద్వేషాలు రెచ్చగొట్టారని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేవని, ఆధారాలు లేకుండానే బండి సంజయ్ పై అభియోగం మోపి కేసు నమోదు చేశారని కోర్టుకు వివరించారు. దీంతో ఆధారాలు లేకుండా కేసు నమోదు చేశారన్న కారణంతో కేసును కొట్టివేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి ప్రకటించారు.

# దామెర చెరువును మినీ ట్యాంక్ బండ్ గా అభివృద్ధి చేస్తా

## పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి




పరకాల, మార్చి 20 (తీన్మార్ న్యూస్): గురువారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు టి యు ఎఫ్ ఐ డి సి, మున్సిపాలిటీ మరియు ఇరిగేషన్ శాఖ అధికారులతో పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఇంటిగ్రేటెడ్ వెజిటేబుల్ మార్కెట్ ను పరిశీలించారు. దామెర చెరువు ప్రాంతాన్ని అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం స్వయానా బైక్ నడుపుతూ దామెర చెరువు కట్ట, తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దామెర చెరువు ప్రాంతాన్ని మినీ ట్యాంక్ బండగా త్వరలో ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. మినీ ట్యాంక్ బండ్ కు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. దామర బండ్ ప్రాంగణంలో గ్రీనరీ, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్,ఏర్పాటు చేస్తామని అన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, స్పోర్ట్స్, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ను అమలు చేయబోతున్నాం అన్నారు. నియోజకవర్గంలోని యువత రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలు పొందాలన్నారు. కన్సల్టెన్సీ ద్వారా పరకాల పట్టణ అభివృద్ధికి డిపిఆర్ ను తయారు చేశామని, దానికి అనుగుణంగా పనులను చేపడుతున్నామని అన్నారు. వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇంటిగ్రేటెడ్ వెజిటేబుల్ మార్కెట్ ప్రాంతాన్ని స్పోర్ట్స్ స్టేడియం లా మార్చుతామని అన్నారు. దీనికి సంబంధించిన విధివిధానాలను రూపొందించాలని అధికారులకు తెలియజేశారు. ఈ స్పోర్ట్స్ స్టేడియంలో ఇండోర్ స్టేడియం, ఫుట్ బాల్,స్విమ్మింగ్ పూల్, తదితర వాటిని ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు.

# సింహాద్రి పుష్పాలంకరణ వేడుకలో పాల్గొన్న వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 20 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం సింగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ మద్దులగూడెం గ్రామనికి చెందిన సింహాద్రి హనుమంత చారి, అనుష దంపతుల కుమార్తెలు సాన్విక, భవ్య శ్రీ ల పుష్పాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారులకు అక్షింతలు వేసి ఆశీర్వదించిన పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు. ఈ యొక్క కార్యక్రమంలో పినపాక మండల కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

# బూత్ లెవల్ ఏజెంట్ లను నియమించండి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, మార్చి 20 (తీన్మార్ న్యూస్): ప్రతి రాజకీయ పార్టీ ప్రతినిధులు బూత్ లెవల్ ల్లో తమ ఏజెంట్స్ లను నియమించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్ నియామకం, స్పెషల్ సమ్మరీ రివిజన్ 2025 పైన గురువారం మినీ కాన్ఫరెన్స్ హాల్ లో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి కలెక్టర్ సమావేశాన్ని ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 865 పోలింగ్ కేంద్రాలలో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు తమ పార్టీ కి చెందిన బూత్ లెవల్ అధికారిని నియమించాలన్నారు. జనవరి 6 న ఓటరు జాబితా ని అన్ని పోలింగ్ స్టేషన్ లలో అందుబాటులో పెట్టడం జరిగిందని నవంబర్ 29 తరువాత నుండి ఇప్పటి వరకు కొత్తగా ఓటరు నమోదు కోసం అలాగే ఓటరు లిస్ట్ లో మార్పులు, చేర్పులు కోసం 3 నియోజకవర్గాల నుండి 13104 దరఖాస్తు లు వచ్చాయాన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ ఓటరుకి ఆధార్ కార్డు అనుసంధానం చేసే ప్రక్రియ ను జిల్లాలో ఈరోజు నుండి మొదలుపెట్టామన్నారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ ఏఓ మన్సూర్, ఎలక్షన్ సెక్షన్ సూపర్ఇంటెండట్ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ నుండి బి.భాస్కర్, టి ఆర్ ఎస్ నుండి ఆర్. రవి, బి జె పి నుండి ఏ. విజయ భాస్కర్, సి పి ఏం నుండి జె. రమేష్, బి ఎస్ పి నుండి ఎం. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# పండ్ల మార్కెట్‌ను మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతాం

## రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ



వరంగల్ జిల్లా, మార్చి 20 (తీన్మార్ న్యూస్): పండ్ల మార్కెట్ ను మోడల్ మార్కెట్ గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర అటవీ పర్యావరణ దేవదాయ శాఖ మాత్యులు శ్రీమతి కొండ సురేఖ అన్నారు. గురువారం వరంగల్ ఏనుమాముల మార్కెట్ పరిధిలో గల ముసలమ్మ కుంటలో పది ఎకరాల విశాలమైన విస్తీర్ణ స్థలంలో ఏర్పాటుచేసిన పండ్ల మార్కెట్ను వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద లతో కలసి మంత్రి ప్రారంభించారు. మార్కెట్లో మామిడికాయల వేలం వేసి మంత్రి ఎమ్మెల్యే కలెక్టర్లు వేలం ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతి పెద్దది ఏనుమాముల మార్కెట్ అని, ఈ మార్కెట్ కు ఆనుకొని ప్రత్యేకంగా పండ్ల క్రయవిక్రయాల కొరకు ప్రభుత్వం కేటాయించిన పది ఎకరాల స్థలంలో ప్రారంభించుకోవడం జరిగిందని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సహకారంతో అవసరమైన అన్ని సౌకర్యాలు ఉండే విధంగా మోడల్ మార్కెట్ గా తీర్చిదిద్దేందుకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలన్నారు. తద్వారా ప్రభుత్వం నుండి నిధులుగా మంజూరుకి కృషి చేస్తామని మంత్రి తెలిపారు. మార్కెట్కు వచ్చే రైతుల సౌకర్యార్థం కనీస వసతులు కల్పించుటకు తన నిధుల నుండి 20 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మార్కెట్కు చేరుకోవడానికి జి డబ్ల్యూ ఎం సి ద్వారా రోడ్డు వేయిస్తామన్నారు. ఈ మార్కెట్ ఏర్పాటు వల్ల ఇతర రాష్ట్రాల నుండి వ్యాపారులు వచ్చి కొనుగోలు చేయడం వల్ల రైతులు పండించిన మామిడి పంటకు మంచి ధర పొందే అవకాశం ఉందన్నారు. మామిడికాయ వ్యాపార లావాదేవీలకు స్థలం లేకపోవడం వల్ల గత నాలుగు సంవత్సరాలుగా ప్రైవేట్ స్థలంలో నిర్వహిస్తున్నారని, వరంగల్ జిల్లా నుండే కాకుండా పరిసర జిల్లాలైన ఖమ్మం సత్తుపల్లి కరీంనగర్ చిత్తూర్ జగిత్యాల సూర్యాపేట జిల్లాల నుండి మామిడి పండ్లు విక్రయించుటకు వచ్చే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండడంతోపాటు ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. కార్మికుల అవసరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి వారికి మార్కెట్లో కనీస సౌకర్యాలు వెంటనే కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వాట్సాప్ గ్రూప్ ద్వారా వ్యవసాయనాలు లేకుండా పండ్లను పండించడంపై సూచనలు చేస్తున్న పట్ల కలెక్టర్ ను అభినందించారు. లాభాలకు బదులుగా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆర్గానిక్ పండ్లను పండించాలని మంత్రి కోరారు. ప్రణాళికబద్ధంగా మార్కెట్ ను అభివృద్ధి చేయుటకు రాష్ట్ర ముఖ్యమంత్రి నుండి నిధులు మంజూరు చేయిస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రత్యేకంగా పండ్ల కొరకు ఏర్పాటు చేసిన హెూల్సేల్ మార్కెట్లో ప్రణాళిక బద్ధంగా పోలీస్ స్టోరేజ్ మంచినీటి సౌకర్యం గోడౌన్ క్యాంటీన్ విద్యుద్దీకరణ ఏర్పాటు చేయుటకు గాను మార్కెటింగ్ ఉద్యానవ వనాల శాఖల ద్వారా ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. వర్ధన్నపేట శాసనసభ్యులు కె నాగరాజు మాట్లాడుతూ పది ఎకరాల విస్తీర్ణస్థలంలో రైతుల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పండ్ల మార్కెట్ మార్కెట్లో ఏ విత్తనాలు జరిపి ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలన్నారు. వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు గారి సహకారంతో మార్కెట్లో అన్ని వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మార్కెట్లో వెంటనే కనీస సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే ఫండ్స్ నుండి 10 లక్షల రూపాయలు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. ఈ సందర్భంగా అధిక మామిడి పంట పండించిన రైతులకు మంత్రి ఎమ్మెల్యే కలెక్టర్లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వ్యవసాయ శాఖ శ్రీనివాస్ , డిప్యూటీ డైరెక్టర్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి సురేఖ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంగీతలక్ష్మి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు రవీందర్రావు, ఫ్రూట్ మర్చంట్ ప్రెసిడెంట్ వెల్ది సాంబయ్య, ట్రేడర్స్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



# భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం చేయాలి



## రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి

## పూడికతీత పనులను పరిశీలించిన మంత్రి సురేఖ

హనుమకొండ జిల్లా, మార్చి 20 (తీన్మార్ న్యూస్): వచ్చే వానకాలం సీజన్ రాకకు ముందుగానే భద్రకాళి చెరువు పూడికతీత పనులు పూర్తి కావాలని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గురువారం భద్రకాళి చెరువు పూడికతీత పనులను వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె అర్.నాగరాజు, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువు పూడికతీత పనుల వివరాలను కలెక్టర్, అధికారులు మంత్రికి వివరించారు. ప్రతిరోజు చెరువు పూడికతీత పనులు కొనసాగుతున్నాయని, సోమవారం నుండి విద్యుత్ లైట్లను, తగినంత సిబ్బందిని ఏర్పాటు చేసి రాత్రి వేళలోనూ పూడికతీత మట్టి తరలింపు ప్రక్రియను మరింత వేగవంతం చేస్తామని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య మంత్రికి వివరించారు. అదేవిధంగా పూడిక మట్టిని తీసుకుని వెళ్లి వచ్చే వాహనాలకు రెండు వైపులా అంతర్గత రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు ఉన్న మార్గం ద్వారా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్న దృష్ట్యా మరో మార్గాన్ని సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. చెరువు పూడికతీత పనులు, అందుకు సంబంధించిన ఏర్పాట్లను సాగునీటి పారుదల శాఖ ఈఈ శంకర్ మంత్రికి వివరించారు. అదేవిధంగా జూ పార్క్ వైపు నుండి వచ్చే మురుగునీరును భద్రకాళి చెరువులో చేరకుండా ప్రణాళికను రూపొందిస్తే బాగుంటుందని కుడా ఛైర్మన్ వెంకట్రాంరెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ చెరువులోకి మురుగు నీరు చేరకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా బయటికి వెళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం నాటికి చెరువు పూడికతీత పనులు పూర్తయ్యే విధంగా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలన్నారు. చెరువు పూడికతీయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కుడా పీవో అజిత్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భూమి పుత్రుడు రైతు

ప్రపంచ కవితా దినోత్సవం మార్చి 21 సందర్భంగా...

అన్నదాత అందరికీ అన్నం పెట్టే రైతు
ఎండనకా వాననకా శ్రమించే రైతన్న
తను శ్రమించి అందరికీ అన్నం పెట్టే రైతు
తను చేసే పనిని దైవంగా నమ్మె రైతు!!

బంగారు లాంటి పంటలు పండించే రైతన్న
వ్యవసాయ క్షేత్రమే తన ప్రపంచం
వానలో నానుతూ చలిలో వణుకుతూ నేలను
దున్నే రైతు
హలం పట్టి అందరి కోసం శ్రమించే రైతు!!

రైతు త్యాగానికి ప్రతీకగా నిలుస్తాడు
రైతు నడుము వంచి కష్టించి
పాడిపంటలు పండించే రైతు
రైతు కష్ట ఫలితమే దేశ సౌభాగ్యం!!

సమాజానికి రైతే వెన్నెముక
జై జవాన్ జై కిసాన్
అన్నదాతలకు అండగా నిలుద్దాం
రైతన్నలను గౌరవిద్దాం రైతులకు
విలువనిద్దాం!!



రచన :-
దేవులపల్లి రమేశ్,
నంగునూర్,
సిద్దిపేట జిల్లా
చరవాణి :
9963701294

# పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో అదనపు కలెక్టర్ సమీక్ష






హనుమకొండ జిల్లా, మార్చి 20 (తీన్మార్ న్యూస్): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పొలిటికల్ పార్టీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు నియోజక వర్గాల వారీగా ఎలక్టోరల్ డ్రాఫ్ట్ మొత్తం ఓటర్లు 508379, కాగా అందులో ఆడిషన్స్ 5485 డెలిశాన్స్ 866 ఉన్నాయని ఫైనల్ ఎలెక్టోరల్ ఓటర్లు 508379 ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్ అనేది నిరంతర ప్రక్రియ అని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఫామ్ 6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఫామ్ 7 ద్వారా ప్రస్తుతమున్న ఓటరు జాబితాలో ప్రతిపాదిత పేరును చేర్చడం మరియు తొలగించడం కొరకు అభ్యంతరాలకు సంబంధించిన వివరాలను పొందుపరిచి నట్లుయితే వారిని పేరును ఓటరు లిస్ట్ నుండి తొలగించడం జరుగుతుందని ఆయన అన్నారు. పొలిటికల్ పార్టీల ప్రతినిధుల ఈ సందర్భంగా వారి సమస్యలను అదనపు కలెక్టర్ కు తెలియజేయడమైనది. ఓటరు కుటుంబ సభ్యులు ఇంటి కోడలు కావచ్చు, లేదా 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు వారి కుటుంబ సభ్యుల బూతులలోని వారి ఓటును కలిగి ఉండాలని ప్రస్తుతం అలా జరగకుండా వేర్వేరు బూతులలో వారి పేర్లు నమోదు అవుతున్నాయని ఇట్టి విషయాన్ని ప్రత్యేక చొరవ తీసుకొని కుటుంబ సభ్యుల ఓట్లు ఒకే పోలింగ్ బూతులు ఉండేలా చూడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, ఇ వి శ్రీనివాస్ రావు, ఎండి. మెహల్ భారతీయ జనతా పార్టీ రావు అమరేందర్ రెడ్డి, సిపిఐ జి. ప్రభాకర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ కే శ్యామ్, వైఎస్ఆర్సిపి రజినీకాంత్ బహుజన సమాజ్ పార్టీ ఎం మనీ, భారత రాష్ట్ర సమితి( బిఆర్ఎస్) బి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి ఒక మైలురాయి

## పదవ తరగతి విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మార్చి 20 (తీన్మార్ న్యూస్): రేపటినుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న ప్రతి విద్యార్థికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో ప్రాధాన్యతను గల పదవ తరగతి పరీక్షలు రేపటి నుండి ప్రారంభమై ఏప్రిల్ 4 వరకు ఉదయం 9 గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని కలెక్టర్ తెలిపారు. పది పరీక్షలు ప్రతి విద్యార్థి జీవితానికి మైలురాయి అని, ఈ మైలురాయిని అధిగమించడానికి మీరు ఎంత దృఢంగా నిలబడతారో తదుపరి మీ ఉజ్వల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులు ఈ పరీక్షల సమయంలో ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయడం ద్వారా విజయం సాధించగలరని ఆయన తెలిపారు. పరీక్షల్లో విజయానికి ప్రణాళిక బద్ధంగా చదివి, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పరీక్షలు అంటే భయపడకుండా అన్ని ప్రశ్నలకు మంచిగా స్పష్టంగా సమాధానాలు రాయాలని సూచించారు. మానసిక ఒత్తిడిని అధిగమించి, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన తెలిపారు. జిల్లాలో 73 పరీక్ష కేం ద్రాలు ఏర్పాటు చేయగా 12,282 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు 73 మం ది చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఏడుగురు రూట్ అధికారులు. 73 మంది డిపార్టుమెంటల్ అధికారులు, 26 మంది సెంటర్ కస్టోడియన్లు, 73 మంది సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాల రవాణా, పరీక్ష అనంతరం సమాధానపత్రాల బండిళ్లను పోస్టా ఫీసులకు చేరవేసేందుకు పోలీసు బందోబస్తు, పరీక్ష కేంద్రాల వద్ద సిసి కెమెరాలు, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, మాల్ ప్రాక్టీస్ ను నిరోధించేందుకు సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేసే విధంగా తగిన చర్యలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థులందరూ పరీక్షా కేంద్రాల వద్దకు సకాలంలో చేరుకునేలా అవసరమైన మార్గాల్లో బస్ సర్వీస్ లు నడిపేలా ఆర్టీసీ అధికారులు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయడానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు కలెక్టర్ తెలిపారు. విద్యార్థులందరూ 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా రాయాలని తద్వారా నూరు శాతం ఫలితాలు సాధించి రాష్ట్రంలో ఉత్తీర్ణత శాతంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## కామ్రేడ్ భగత్ సింగ్ 94వ వర్ధంతి వారోత్సవాలను జయప్రదం చేయండి

**కాళోజి జంక్షన్లో పోస్టర్ ఆవిష్కరించిన పిడిఎస్యు నాయకులు**



వరంగల్, మార్చి 20 (తీన్మార్ న్యూస్): బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడి పురిత్రాడును ముద్దాడిన యువ కిశోరులు కామ్రేడ్ భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ ల 94వ వర్ధంతి వారోత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ( పిడిఎస్యు) ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో కాళోజి జంక్షన్లో పోస్టర్ ఆవిష్కరించారు. పిడిఎస్యు, పి వై ఎల్, సంఘాల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 23వ తేదీ నుండి 30వ తేదీ వరకు 94 వ వర్ధంతి వారోత్సవాలను జరపాలని పిలుపునిచ్చాయని వారు తెలిపారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యు ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షులు రాచర్ల బాలరాజు,ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ లు మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత విద్యార్థి నిరుద్యోగులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న దురాహంకారానికి వ్యతిరేకంగా పోరాడాలన్నారు .అలాగే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్ఈపి 20-20 మరియు యుజిసి ముసాయిదాలను రద్దు కోసం హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో వైస్ ఛాన్స్ లర్ విద్యార్థి సంఘాలు చేసే ఆందోళన ఇతర కార్యక్రమాలపై నిషేధం ఎత్తివేతకు ప్రజాసామిక పోరాడాలని ఆయన కోరారు. నేడు దేశంలో రోజురోజుకు పెరుగుతున్న బిజెపి మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థి లోకం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పి డి ఎస్ యు జిల్లా కోశాధికారి సామాజీ పవన్ జిల్లా నాయకులు ఉదతగణేష్, రాజేష్,అనిల్,మధు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ టోప్పో**



మహబూబాబాద్ జిల్లా, మార్చి 20 (తీన్మార్ న్యూస్): గురువారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో మహబూబాబాద్, కేసముద్రం, ఇనుగుర్తి, మండలలో పదవ తరగతి పరీక్షల నిర్వహణకు ఎంపికైన జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు, త్రాగునీరు, విద్యుత్ సరఫరా, ఏలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్ష జరిగే సమయాలలో పరిసర ప్రాంతాలలో జిరాక్స్ సెంటర్ల మూసివేత, 144 సెక్షన్ విధించడం, తదితర అన్ని విషయాలు సంబంధిత తహసిల్దారులు, చీఫ్ సూపర్డెంట్స్, విద్యాశాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు, పరీక్షలు సమయాలలో ప్రమాణ సదుపాయం టైం టు టైం బస్సులు నడపాలని తెలిపారు. వేసవి కాలంలో నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, మందులు, ఓ ఆర్ ఎస్, అందుబాటులో ఉండాలని సూచించారు.

## అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు



**గత పదేండ్ల బిఆర్ఎస్ ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు.**

**మదనాపురంలో నమూనా ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన**

**దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి.**

దేవరకద్ర ప్రతినిధి,మార్చి20(తీన్మార్ న్యూస్) : అర్హులైన ప్రతీ పేదవాడికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు అందిస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు.వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించిన నమూనా భవన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని అనంతరం,మండల తహసీల్దార్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్, రైతు బీమా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి.తదనంతరం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జీవిత చరిత్రపై వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు ప్రధానం చేసి,దంతనూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే జియంఆర్.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇంటి నిర్మాణం చేసుకునేందుకు పనులు మొదలు పెట్టడం జరిగిందన్నారు.ముందుగా అతి నిరుపేదలైన ప్రజలకు మొదటి విడతగా ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు.ఇండ్ల నిర్మాణంలో ప్రాధాన్యత క్రమంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి అవకాశాన్ని కల్పించడం జరుగుతుందని అన్నారు.ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయానికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందిస్తూ,ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.ఇండ్ల కోసం ఎంపిక చేసే లబ్ధిదారుల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అర్హులైన వారిని ఎంపిక చేసి లబ్ధి చేకూరే విధంగా అధికారులు,నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.బిఆర్ఎస్ పదేళ్ల పాలన లో గ్రామంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా నిర్మించలేదని గత ప్రభుత్వంపై మండిపడ్డరు.రైతులు మరియు మహిళల అభివృద్ధియే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని సూచించారు.గత పదేండ్ల బి.ఆర్.ఎస్ ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని కోరారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన అప్పులకు మిత్తిలు కట్టుకుంటూ ఇచ్చిన హామీలునెరవేరుస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు అధికారులు వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల సహకారం అవసరం

**డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్**



ములుగు జిల్లా, మార్చి 20 (తీన్మార్ న్యూస్): ఓటరు జాబితా రూపకల్పన, నవీకరణకు రాజకీయ పార్టీల సహకారం అవసరమని డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి తెలిపారు. గురువారం కలెక్టరేట్ వీడియో సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటరు జాబితా పరిశుద్ధత చాలా ముఖ్యమైనదని, అర్హులైన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిదీ అని ఆయన సూచించారు. గత సంవత్సరం నవంబర్ నుండి ఈ నెల 18వ తేదీ వరకు నూతన ఓటరు నమోదుకు ఫారం 6 ద్వారా 1324 దరఖాస్తు లు రాగా 1172 విచారణ పూర్తి చేశారని, 152 పెండింగ్ ఉన్నాయని తెలిపారు. ఫారం 7 కు 290 రాగా 94 విచారణ జరిగిందని 196 పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. చిరునామా మార్పు కు 1295 దరకాస్తులు వచ్చాయని వాటిలో .1061 విచారణ పూర్తి కాగా 234 పెండింగ్ ఉన్నాయన్నారు. కరెక్షన్స్ కొరకు 1257 దరఖాస్తులు వచ్చాయని వాటిలో ఇప్పటి వరకు 916 విచారణ పూర్తి కాగా 341 పెండింగ్ ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా తయారుకు రిటర్నింగ్ అధికారి ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించ నున్నట్లు తెలిపారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు బూతు స్థాయి ఏజెంట్లును నియమించి జాబితా అందచేయాలని సూచించారు. ఫారం 7 ద్వారా నోటీస్ జారీ తదుపరి మాత్రమే ఓటు హక్కు తొలగించాలని, సుమోటో గా తొలగించడానికి అవకాశం లేదని తెలిపారు. అర్హులైన ఓటర్లను జాబితాలో చేర్చడం, రెండు ఓట్లున్న ఓటర్లను తొలగించే ప్రక్రియలో రాజకీయ పార్టీలు తమ కార్యకర్తల ద్వారా సరైన ఓటరు వివరాలను అందించేందుకు ముందుకు రావాలని, ఈ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా సహకరించాలని ఆయన సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు కాబట్టి, ప్రతి అర్హుడు ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటేష్, తహశీల్దార్ విజయ భాస్కర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సలీమ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందులో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు**





జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మార్చి 20 (తీన్మార్ న్యూస్): కాటారం మండలంలోని బిఎల్ఎం గార్డెన్లో గురువారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. స్థానిక ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రంజాన్ మాసం త్యాగం, సహనానికి ప్రతీక అని, సమాజంలో ఐక్యత, ప్రేమ, సౌభ్రాతుత్వాన్ని పెంపొందించే పర్వదినమని తెలిపారు. ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందని, రాష్ట్రంలోని ముస్లిం సోదరుల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ముస్లిం మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు పెన్నులు, ప్యాడులు అందజేత

**హాజరైన ఎన్హెచ్ఆర్సి రాష్ట అధ్యక్షులు డా. మొగుళ్ళ భద్రయ్య**



ములుగు, మార్చి 20 (తీన్మార్ న్యూస్): జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) ములుగు మండల ఉపాధ్యక్షులు బుద్దే మల్లయ్య ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సన్రైజర్స్ హై స్కూల్లో రేపటి నుండి పదవ తరగతి వార్షిక పరీక్షలు రాయబోయే విద్యార్థులకు పెన్నులు ప్యాడులను రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య సార్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష హాల్లోకి ఎలాంటి భయం సంకోచం లేకుండా పోవాలని పరీక్షలను మంచి దస్తూరితో పేపర్ ప్రజెంటేషన్ చేయాలని సూచించారు. పరీక్ష రాసే ముందు ప్రశ్నాపత్రాన్ని ఒకటికి రెండు సార్లు చదివి అర్థమైన రీతిలో ఒక నిర్ణయానికి వచ్చి సమాధానాలు స్పష్టంగా రాయాలని ఆయన అన్నారు. మనిషి జీవితంలో ఏది సాధించాలన్న చదువే ముఖ్యమని తెలిపారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ సూపరిండెంట్ మడుగురి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీ పరీక్షలను సులువుగా ఎదుర్కోవడానికి ప్రణాళికబద్ధంగా చదవాలని ఆయన అన్నారు. జీవితంలో కష్టపడితే సాధించనిది అంటూ ఏది ఉండదని ఆయన అన్నారు. కష్టాన్ని ఇష్టంగా తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్, ఎన్ హెచ్ ఆర్ సి జిల్లా అధ్యక్షులు పెట్టెం రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి సన్నగుండ్ల వెంకటేశ్వర్లు, స్టేట్ సోషల్ మీడియా కో కన్వీనర్ కోడిపాక రవి, ములుగు మండల అధ్యక్షులు డాక్టర్ వీరమల్ల రాము, ములుగు పట్టణ అధ్యక్షురాలు ఉప్పుల కోమల, గణేష్ యాదవ్, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ బలుగూరి జనార్ధన్, ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ అని శుభాశీస్సులు అందించారు.

## బీజేపీ నాయకులు సోయిలో ఉండి మాట్లాడాలి

**పట్టణ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేసోజు అభినయ్**



ములుగు, మార్చి 20 (తీన్మార్ న్యూస్): ములుగు పట్టణ కేంద్రంలో బస్ స్టాండ్ నిర్మాణం గురించి కొందరు బీజేపీ నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం మన మంత్రి సీతక్క చొరవతో ములుగు జిల్లా కేంద్రంలో అత్యాధునిక పద్ధతిలో బస్ స్టాండ్ నిర్మాణం చేపట్టబోతుంది. బస్ స్టాండ్ నిర్మాణం కోసం టెండర్ వేయడం మరియు ,డిజైన్ కోసం పరిశీలన చర్యలు జరుగుతున్నాయి దానికి కొంచం సమయం పడుతుంది కానీ అది గ్రహించని బీజేపీ నాయకులు కనీస అవగాహన లేని వ్యక్తులతో మాట్లాడుతున్నారు. ఇంతకు ముందు కూడా బస్ స్టాండ్ ఆవరణలోని పోచమ్మ గుడి లేకుండా చేస్తున్నారని తప్పుడు ప్రచారాలు చేశారు. ఇదే బీజేపీ నాయకులు గత ప్రభుత్వంలో 10 సంవత్సరాలు ఏం చేశారు. ములుగు జిల్లాకి ఏటూరునాగారం లో బస్ డిపో 10 సంవత్సరాల్లో ఎప్పుడు జరగనిది మంత్రి సీతక్క గారి వల్లనే మంజూరు చేయడం జరిగింది దాని నిర్మాణం గురించి కూడా చర్యలు జరుగుతున్నాయి. ములుగు జిల్లా అభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి వాక్యాలు చేయడం సిగ్గు చేటు కనీసం బస్ స్టాండ్ నిర్మాణం గురించి అప్పుడు అడగలేని దద్దమ్మలు ఈ రోజు బస్ స్టాండ్ గురించి మాట్లాడడం సిగ్గు చేటు బీజేపీ నాయకులు స్థానికంగా ఉన్న నాయకులు మాట్లాడే దమ్ము లేక అద్దెకు వచ్చిన వ్యక్తులతో మాట్లడిస్తూన్నారు బీజేపీ నాయకులకు చెప్పేది ఒక్కటే కనీసం ఇప్పటికైనా కొంచం అవగాహన పెంచుకుని రాజకీయాలు చేయడం మంచిదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో సందీప్, సాయి, అతీఫ్, రఫీద్, హేమంత్, వినయ్, కన్ని, రోహిత్, సంజీవ్, పవన్, నయీం, బన్నీ తదితరులు పాల్గొన్నారు.



# రాజకీయ సంస్కరణలు రావాలి!

రాజకీయ సంస్కరణలు లేకుండా భారత్మనుగడ సాధ్యం అయ్యేలా కనిపించడం లేదు. ఎంతసేపు సీట్లు, ఓట్లు,నాయకుల జీతాలు, భత్యాలు, పెన్షన్లు, ఉచిత పథకాలు వంటివాటి చుట్టే రాజకీయం సాగుతోంది. దీనికి ఎక్కడో ఒక చోట ముగింపు రావాల్సి ఉంది. చైనా లాంటి దేశాలు ఆర్థికంగా పురోగమిస్తుంటే భారత్ మాత్రం కేవలం రాజకీయ నాయకుల స్వార్థం కారణంగా కుంటుతోంది. ఇంకా సీట్లు పెంచుకోవాలి...తమకు అవకాశాలు పెంచుకోవాలన్న దురాలోచన తప్ప ప్రజల సమస్యలు తీర్చడం, ఆకలి బాధలు తీర్చడం, సౌకర్యాలు పెంచడం వంటివన్నీ పక్కకు పోతున్నాయి. ప్రజల ఎజెండా ముందుకు రావడం లేదు. డీలిమిటేషన్‌తో తమ సీట్లు తగ్గుతాయని గొడవ చేస్తున్న స్టాలిన్ లాంటి వారు దీనికి సమాధానం చెప్పాలి. ఆయనకు వ్తాసు పలుకుతున్న వారు కూడా సమాధానం చెప్పాలి. అలాగే పదేళ్లుగా అధికారంలో ఉన్ మోడీ ముందుగా సమాధానం చెప్పాలి. ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందా లేదా..ధరలు అదుపులోకి వచ్చాయా లేదా..నిరుద్యోగం తగ్గిందా లేదా అన్నది చట్టసభల్లో చర్చించడం లేదు. ప్రజలకు అవసరం లేని ఎజెండాలు తెరపైకి తెచ్చి, తమ పబ్బం గడుపుకునే రాజకీయాలు సాగుతున్నాయి. భారత జనాభా 140 కోట్లకు చేరిన క్రమంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరడం లేదు. ఇంకా జనాభా పెరగాలని కొందరు ప్రాంతీయ పార్టీల నేతలు ముఖ్యంగా స్టాలిన్, చంద్రబాబు లాంటి వారు ప్రచారం చేయడం సిగ్గుచేటు. ఉన్న ప్రజలకు సరైన ప్రాథిమిక సౌకర్యాలు కలిగించకుండా తమ రక్షణ కోసం వందలకోట్లు వెచ్చిస్తున్న వీరు ప్రజలను రక్షిస్తారనుకోవడం అత్యాశే కాగలదు. మారుతున్న కాలానుగుణంగా పాలకుల్లో మార్పులు రావడం లేదు. ఇకపోతే ఒకే పార్టీలో ఉంటున్న కొందరు రాజకీయ గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారు. పాలనలో వారు, వారి కుటుంబ సభ్యులే నిరంతరంగా ఉండే విధంగా రాజకీయాలను తమకు అనుకూలంగా మార్చేసుకుంటున్నారు. పార్లమెంట్, అసెంబ్లీలకు ఒక్కరినే నిరంతరంగా ఎన్నుకునే విధానం కూడా మంచిది కాదు. ఈ క్రమంలో రాజకీయాల్లో మార్పులు రావాలి. అమెరికా తరహాలో కేవలం రెండు పర్యాయాలు మాత్రమే ఎన్నికల్లో పోటీచేసే విధానం రావాలి. ఒక్కరే ఏళ్లతరబడి ఎంపిలుగా, ఎమ్మెల్యేలుగా ఉండకుండా కేవలం రెండు టర్మ్‌ల కాలాన్ని మాత్రమే నియంత్రించాలి. ఈ మేరకు రాజ్యాంగంలో సవరణలు తీసుకుని రావాల్సి ఉంది. ప్రజలు ఈ ఎజెండాతో ముందుకు రావాలి. అప్పుడే యువతకు అవకాశం వస్తుంది. మువత రాజీకాయల్లోకి వస్తే మార్పులు కూడా వస్తాయి. ఎన్నికల్లో పోటీ చేసేవారికి అర్హతలను కూడా నిర్ణయించాలి. ఇలా అర్హతలు లేకపోవడం వల్లనే స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య ఫలాలు అందరికీ అందడం లేదు. కొందరే పాలకులుగా ఉంటూ..ప్రజల ఆకాంక్షలను విస్మరిస్తున్నారు. అందుకే పేదలు పేదలుగానే ఉన్నారు. ఆకలి కోసం అలమటిస్తున్న వారు అలాగే ఉన్నారు. రాజకీయ నేతలు పేదల పేరు చెప్పి పబ్బం గడుపుకుంటున్నారు. పాలకుల నిర్లక్ష్యం,విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు చేయడం,ఉచిత పథకాలను ప్రవేశ పెట్టడం వంటివన్నీ తగ్గాలి. మనం వేసే ఓటు సక్రమంగా పనిచేస్తుందా లేదా అన్నది ప్రజలు ఆలోచన చేయాలి. మన ఓటుతో గెలిచిన నేతలు సక్రమంగా పనిచేస్తున్నారా లేదా అన్నది కూడా ప్రజలే ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలి. మన ఓటును ఆయుధంగా చేసుకుని దేశాన్ని సక్రంగా ముందుకు తీసుకుని వెళుతున్నారా లేదా అన్న ఆలోచన చేయాలి. ఏదో ఓటేశామన్న నిర్లిప్త ధోరణి కారణంగా పాలకులు రాజకీయాలను వ్యాపారంగా మార్చుకుని, అధికారం చేతబట్టి శాసిస్తున్నారు. ప్రజలను ఓటుబ్యాంకుగా తయారుచేసుకుని వారిని మభ్యపెట్టడం అలవం-ౘకున్నారు. ఎన్నికల అక్రమాల్లో ఆరితేరిన నేతలంతా పాలకులుగా పెత్తనం చెలాయిస్తున్నారు. ఓట్లను కొనుగోలు చేయడం ఎలాగో నేర్చుకున్నారు. మనం ఓటుకు అమ్ముడు పోవడం వల్లనే ఇలా జరుగుతోందని గుర్తించాలి. తమకు అనుకూలమైన ఎన్నికల అధికారులను, పోలీస్ అధికారులను అడ్డం పెట్టుకుని ఓట్లను వేయించుకుని ఎన్నికవుతున్నారు. ఈ విధానం పోవాలంటే ఎన్నికల్లో భారీ సంస్కరణలు రావాలి. ఒక్కరే నిరంతరంగా సర్పంచ్ నుంచి ఎంపి వరకు ఎల్లవేళలా ఎన్నికయ్యే పద్ధతికి స్వస్తి పలకాలి. చట్టసభల్లో అమెరికా లాగా కేవలం రెండు పర్యాయాలు మాత్రమే పోటీచేసే అవకాశం మాత్రమే ఉండాలి. ఎంపి, లేదా ఎమ్మెల్యేగా గెలిచిన వారు రెండు టర్మ్‌లకు మించి పనిచేయకుండా చట్టబద్ధ విధానం అమల్లోకి తీసుకుని రావాలి. జీవితాంతం ఒక్కరే ఎంపిగా లేదా ఎమ్మెల్యేగా ఉండే విధానం పోవాలి. దీనికి తక్షణ రాజ్యాంగ సంస్కరణ అవసరం. అప్పుడు ప్రజల్లో ఎక్కువ మందికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం వస్తుంది. కొందరు నాయకులు మాత్రమే నిరంతరంగా అధికారాన్ని అడ్డం పెట్టుకునే ఆగత్యం ఉండదు. అలాగే కుటుంబంలో ఒక్కరికి ఒకే పదవి అన్న విధానం కూడా రావాలి. వారసత్వ రాజకీయాలను అడ్డుకోవడానికి ఇది దోహద పడగలదు. దేశంలోని యువత, మేధావులు దీనిపై చర్చచేయాలి. అలాగే రాజకీయ నాయకుల అవినీతిపై తక్షణం విచారణ జరిగేలా చట్టాలు రావాలి. సామాన్యులకు ఎలా అయితే చట్టబద్ధ విచారణ సాగి, శిక్షలు పడుతున్నాయో రాజకీయాల ను, పాలనను అడ్డం పెట్టుకుని అడ్డగోలుగా కోట్లు గడిస్తున్న నాయకులకు కూడా అలాగే విచారణ జరగాలి. శిక్షలు పడాలి. ఇలాంటి సంస్కరణలపై దేశవ్యాప్తంగా చర్చ జరగాలి. అక్రమంగా వేలకోట్లు సంపాదిస్తున్న వారంతా మహా నేతాలుగా చలామణి అవుతున్నారు. ఇకపోతే రాష్ట్రాల్లో అధికారం లో ఉండగా అవినీతికి పాల్పడిన నేతలను విచారించి కఠినచర్యలు తీసుకునే అధికారం కేంద్రప్రభుత్వానికి ఉండాలి. కేంద్రంలో అవినీతి జరిగితే కూడా నేతలను తక్షణం విచారించే రాజ్యాంగ వ్యవస్థ రావాలి. రాజకీయ నేతల అవినీతిపై తక్షణం లోక్‌పాల్ ఏర్పాటు అత్యావశ్యకం. ఎప్పటికప్పుడు సంస్కరణలు చేసుకుంటూ.. రాజ్యాంగాన్ని సవరించుకుంటున్న మనం ఈ విషయంలో కూడా సవరణలకు పూనుకోవాలి. ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి రావడం వల్ల ఆయా నేతల కారణంగా ఎక్కువ శాతం అవినీతికి ఆస్కారం ఏర్పడింది. అలాంటి వారి పనిపట్టే చట్టబద్ధ వ్యవస్థ ఉండాలి. రాజకీయ పార్టీల నేతల అవినీతిపై సత్వర విచారణకు సుప్రీం సూచించినా అడుగు ముందుకు పడడం లేదు. అవినీతి కేసులు ఉన్నా ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా చలామణి అవుతున్నారు. రాజకీయ అవినీతిని నిరోధించేలా రాజ్యాంగ సంస్కరణలకు శ్రీకారం చుడితేనే మన ప్రజాస్టామ్యానికి అర్థం ఉంటుంది.

# అధికారం పోయినా.. అభిమానం పోలే..



- విషప్రచారంతోనే బిఆర్ఎస్ అధికారం కోల్పోయింది
- అభివృద్ధి పనుల ముందు విషప్రచారమే గెలిచింది
- ప్రజల పక్షాన కొట్లాడుతున్న కార్యకర్తలు వీరులు
- సూర్యాపేట సభలో కేటీఆర్

**సూర్యాపేట, (తీన్మార్ న్యూస్):** ఓ సింగర్ చెప్పినట్లుగా.. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓటమికి అసూయ, ద్వేషం, ఆశ కారణమైనట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మూడింటి వల్లే బీఆర్ఎస్ పార్టీ అనుకు న్నన్ని సీట్లు సాధించలేకపోయిందని ఆ సింగర్ చెప్పారని కేటీఆర్ తెలిపారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బీఆర్ ఎస్ సభలో కేటీఆర్ ప్రసంగించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మెడికల్ కాలేజీలు, దామరచర్ల విద్యుత్ ప్లాంట్, యాదాద్రి ఆలయంతో పాటు- ఎన్నో ప్రాజెక్టులు నిర్మించాం కదా.. ఎందుకు ఓడిపోయామని ఓ సింగర్‌తో అంటే.. ఆయన ఇలా సమాధానం చెప్పారు. అసూయ అంటే అ ధికార పార్టీలోకి రాగానే ఎమ్మెల్యేలు కొత్త కారు, కొత్త ఇల్లు కట్టుకున్నాడని ప్రచారం చేశారు. ఇది వరకు అం గి లేకుండా తిరిగినట్టు ఇవాళ కొంత మంది నాయకులు కొత్త అంగి వేసుకున్నట్టు అసూయ పడ్డారు. మరో వైపు ద్వేషం..ఈ రాష్ట్రాన్ని కుటుంబం కోసం తెచ్చినట్టు.. దొర పాలన అని ప్రజల్లో ద్వేషం నిండే విధంగా అగ్ర నాయకత్వంపై ప్రచారం చేశారు. ఇక ఆశ.. కేసీఆర్ పదివేలు ఇస్తుండు.. నేను పదిహేను వేలు వేస్తా.. ఇద్దరికీ పెన్షన్లు ఇస్తా అని ఆశ పెట్టిండు. ఎతుల వెంకట్‌రెడ్డి, కోతుల ఉత్తమ్ కుమార్ ఆశలు పెట్టి మోసం చేశారు. కాంగ్రెసోడు, బీజేపోడు అభివృద్ధి గురించి మాట్లాడలేదు. మెడికల్ కాలేజీ, ఎస్పీ ఆఫీసు గురించి మాట్లాడలేదు. కొత్త మండలాలు, కొత్త గ్రామ పంచాయతీల గురించి చెప్పలేదు. అసూయ, ద్వేషం, ఆశ నింపి ఓడగొట్టారని కేటీఆర్ గుర్తు చేశారు. కేసీఆర్ దొర అని యూట్యూబ్‌లో పనికిమాలిన చెత్త మాట్లాడి తిట్టని తిట్లు- తిట్టి విషప్రచారం చేసి అధికారంలోకి వచ్చిండు. ఇవాళ అదే యూట్యూబ్ వాళ్లను గుడ్డలుడదీసి కొడుతాడట. ఆయన కాడికి వస్తే అన్ని గుర్తుకు వస్తున్నాయి. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిండు రేవంత్ రెడ్డి అని కేటీఆర్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు తెలంగాణకు ఏనాటికైనా శత్రువే.. బీజేపీ నేతలు సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడరు.. కిషన్ రెడ్డి, బండి సంజయ్ రేవంత్‌పై ఈగ వాలకుండా కాపాడుతున్నారని ఆయన ఆరోపించారు. ఇవాళ కూడా బీఆర్ఎస్ అధికారం కోరుకోవడం.. తెలంగాణకు చారిత్రక అవసరం. కర్కశ కాంగ్రెస్ పాలన పీడ వదిలించుకోవాలంటే గులాబీ జెండాతోని అయితదని ప్రజలు గుర్తించారని కేటీ-ఆర్ పేర్కొన్నారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక్క సూర్యాపేట గెలిచింది. పార్లమెంట్‌లో ఓడిపోయాం. చాలా మంది అన్నారు అయిపోయింది వీళ్ల పని అని. పార్టీ మూతపడుతది అని మాట్లాడారు. ఒక ఫినిక్స్ పక్షిలాగా ఆకాశాన్ని అందుకునే విధంగా అద్భుతంగా తన పోరాట పటిమతో ముందుకు సాగుతదో.. అదే విధంగా ఇవాళ కదం తొక్కి అటు- కాంగ్రెస్‌కు, ఇటు- బీజేపీకి కాళరాత్రులు చూపెడుతున్న మీ అందరికి శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నాం. మేం ఒక్క నిరసనకు పిలుపునిస్తే కేసులు పెట్టినా భయపడకుండా పోరాడుతున్న మీ అందరికీ హృదయపూర్వకంగా మనస్కారం చేస్తున్నా. మీరు గొప్ప పోరాటం చేస్తున్నారు అని కేటీఆర్ ప్రశంసల వర్షం కురిపించారు.

# బెట్టింగ్ యాప్స్ కేసులో విచారణ

**పంజాగుట్ట పోలీసుల విచారణకు విష్ణుప్రియ.. సెల్‌ఫోన్ సీజ్ చేసిన పోలీసులు**



హైదరాబాద్, మార్చి 20: బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ వ్యవహారంలో యాంకర్ విష్ణుప్రియను మూడు గంటల పాటు పోలీసులు విచారించారు. ఆమె స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డు చేశారు. విష్ణుప్రియ మొబైల్‌ను పంజాగుట్ట పోలీసులు సీజ్ చేశారు. బెట్టింగ్ యాప్స్ కేసులో గురువారం ఆరుమంది విచారణకు హాజరుకావాల్సి ఉంది. కానీ కేవలం విష్ణుప్రియ మాత్రమే పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. విష్ణుప్రియను కూడా రెండు రోజుల క్రితమే విచారణకు హాజరుకావాలని నోటీ-సులు ఇచ్చారు పోలీసులు. అయితే వ్యక్తిగత కారణాల వల్ల విచారణకు హాజరుకాలేకపోతున్నానని, రెండు రోజులు తనకు సమయం ఇవ్వాలని విష్ణుప్రియ పోలీసులను కోరారు. ఇందుకు పోలీసులు అనుమతి ఇవ్వడంతో గురువారం విష్ణుప్రియ వ్యక్తిగతంగా పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఉదయం 10:15 గంటలకు విష్ణుప్రియ పంజాగుట్ట పోలీసుల ఎదుట విచారణకు హాజరవగా.. దాదాపు మూడు గంటల పాటు- విచారించిన పోలీసులు ఆమె స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. విష్ణుప్రియతో పాటు- ఆమె తరపున న్యాయవాది విచారణకు హాజరయ్యారు. ఇక విచారణలో భాగంగా.. బెట్టింగ్ యాప్ ప్రమోషన్‌లో భారీగా డబ్బులు తీసుకున్నట్లు- విష్ణుప్రియ ఒప్పుకున్నారు. మొత్తం 15 బెట్టింగ్ యాప్‌లకు ఆమె ప్రమోషన్స్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్ వేదిక ద్వారా బెట్టింగ్ ప్రమోషన్ చేశారు. ఇప్పటికే విష్ణుప్రియ బ్యాంకు స్టేట్‌మెంట్‌ను పోలీసులు తీసుకున్నారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్‌కు సంబంధించి విష్ణుప్రియకు సంబంధించిన పోస్టింగ్‌లను ఇప్పటికే పంజాగుట్ట పోలీసులు గుర్తించారు. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసే విధంగా ఆమె సోషల్ మీడియాలో విపరీతంగా పోస్టింగ్‌లు పెట్టడం, ఆ యాప్‌ల్లో డబ్బులు పెట్టి సంపాదించవచ్చని డైరెక్ట్‌గా చాలా మందిని బెట్టింగ్ వైపుకు మళ్లించే విధంగా విష్ణుప్రియ పోస్టింగ్‌లు పెట్టారు. వాటిపైనే మూడు గంటల పాటు పోలీసులు సుదీర్ఘంగా విచారణ జరిపారు. ఈ కేసులో నిందితురాలుగా ఉన్న విష్ణుప్రియ మొబైల్‌ను కూడా పోలీసులు సీజ్ చేశారు. ఎప్పుడు విచారణకు పిలిచినా అందుబాటు-లో ఉండాలని పంజాగుట్ట పోలీసులు ఆదేశించారు. పంజాగుట్టలో నమోదైన ఎఫ్ఐఆర్‌లో ఇప్పటికే 11 మందిని నిందితులుగా చేర్చారు పోలీసులు. వారందరికీ కూడా వ్యక్తిగతంగా నోటీ-సులు జారీ చేశారు. రోజువారి విచారణలో భాగంగా ముగ్గురు ముగ్గురు చొప్పున విచారణకు రావాలని ఆదేశించినప్పటికీ కేవలం ఇద్దరు మాత్రమే విచారణకు హాజరయ్యారు. టేస్టీ తేజ విచారణకు హాజరయ్యారు. సోషల్‌మీడియాలో బెట్టింగ్ యాప్‌లపై పోస్టులు పెట్టిన కానిస్టేబుల్ కిరణ్ గౌడ్ కూడా పోలీసుల ఎదుట వ్యక్తిగతంగా విచారణకు రాగా.. మూడు గంటల పాటు- పోలీసులు అతడిని విచారించి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు.

# స్వార్థం పతన హేతువు!

**తిరుమల,జనవరి 24 :** స్వార్థం ఎంతటికైనా పురిగొల్పుతుంది. మానవుడిలో పశుప్రవృత్తి కనిపిస్తుంది. మృగంగా తయారు చేస్తుంది. మానవజీవన పురోగతికి, ఉత్తమ సమాజ నిర్మాణానికి స్వార్థ గుణం పెద్ద అవరోధం. ఏ విధమైన వికాసం జరగడానికైనా ముఖ్యమైన అడ్డంకి కాగలదు.ఆస్తి కోసం తల్లిదండ్రులను, అన్నదమ్ములను కడతేర్చేలా చేస్తుంది. తనకు మాత్రమే అన్న ధోరణి వాంఛనీయం కాదు. ఎవరికైనా కొంత వరకూ స్వార్థం ఉండవచ్చు. ఆ స్వార్థం వారికి కొంతవరకు ఉపయోగపడచ్చు. కానీ.. ఆ గుణం ఎక్కడ శ్రుతి మించుతుందో అక్కడ మానవసంబంధాలు, మానవవిలువవలు విధ్వంసానికి గురవుతాయి. భాగవతంలో కంసుని విషయంలో ఇదే జరిగింది. సోదరి దేవకీదేవిని, వసుదేవుని వారి వివాహానంతరం తానే సారథిగా మారి రథంలో తీసుకెళు [తు]ండగా.. అశరీరవాణి మాటలు విన్న కంసుడు తన సోదరిని, వసుదేవుని సంహరించే ప్రయత్నం చేశాడు. చివరకు వారి వినతి కారణంగా బంధించాడు. తాను పూర్వం కాలనేమినని, తనను విష్ణువు సంహరించాడని తెలుసుకున్న కంసుడు విష్ణుద్వేషంతోనే తన జీవితాన్ని గడిపాడు. కన్న తండ్రినే కారాగారంలో బంధించి శూరసేన రాజ్యపాలన మొదలుపెట్టాడు. తాను మాత్రమే రాజుకావాలన్న స్వార్థం బాంధవ్యాన్ని కూడా విస్మరించేలా చేసింది. మిక్కిలి స్వార్థబుద్ధితో తమ తల్లిదండ్రులను, సోదరులను, ఒక్కోసారి పుత్రులను, అవసరమైతే స్నేహితులను, సఖీజానాన్ని కూడా వధించడానికి వెనకాడరు. అదే విషయాన్ని పోతన మహాకవి భాగవతలో వివరించారు. కేవలం తన స్వార్థం కోసం ఆత్మీయులను కూడా చంపాలన్న యోచన ఎంత అమానుషమో భాగవతం చెబుతుంది. పరమ స్వార్థపరుడు కనుకనే కంసుడు యదువంశీయులతో వైరం పెంచుకొని ఇతర రాక్షస రాజులు, బాణుడు, భౌముడు, జరాసంధుడు మొదలైన వారి సాయంతో వారితో కయ్యం కొనసాగిస్తూ వచ్చాడు. శ్రీమహావిష్ణువే మరోచోట పుట్టి పెరుగుతున్నాడన్న సమాచారం తెలియగానే.. ప్రలంబుడు, బకుడు, చాణూరుడు, తృణావర్తుడు, అఘాసురుడు, ముష్టికుడు, అరిషుడు, ద్వివిదుడు, పూతన, కేశి, ధేనుకుడు మొదలైనవారిని ప్రయోగించడం అతనిలోని క్రూరత్వానికి పరాకాష్ట. అతడి స్వార్థమే అతడి సర్వనాశనానికి దారి తీసింది.

# పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

**టెలీఅవీవ్‌పై ఇజ్రాయిల్ వైమానిక దాడులు**

**తాజాగా 70 మంది మృతి చెందినట్లు అంచనా**



**గాజా, మార్చి 20 (తీన్మార్ న్యూస్):** ఇజ్రాయెల్, హమాస్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడుల్లో 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తాజాగా టెల్‌అవీవ్ దళాలు మరోసారి వైమానిక దాడులతో విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో అనేకమంది మృతి చెందినట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం గాజాపై ఐడీఎఫ్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో దాదాపు 70 మంది మృతి చెందినట్లు- స్థానిక అధికారులు తెలిపారు. ఇందులో ఓ మహిళతో సహా అనేక మంది చిన్నారులు ఉన్నట్లు- వెల్లడించారు. ఇక, ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ గాజాకు తీవ్ర హెచ్చరికలు చేశారు. బందీలందరినీ తిరిగివ్వడానికి ఇదే చివరి అవకాశమని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటు-ందని పేర్కొన్నారు. మరోవైపు.. నెట్జారిమ్ నడవాలో కొంత భూభాగాన్ని టెల్‌అవీవ్ స్వాధీనం చేసుకుంది. ఇక్కడినుంచి పాలస్తీనావాసుల కదలికలను నియంత్రించే వెసులుబాటు- దానికి దక్కింది. మంగళవారం గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో 400 మందికి పైగా మృతిచెందగా.. అనేకమంది గాయపడ్డారు. మృతుల్లో చిన్నారులు, మహిళలే ఎక్కువమంది ఉన్నారు. ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలో మార్పులు చేయడానికి హమాస్ తిరస్కరించడంతోనే దాడులకు ఆదేశించానని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. బందీలను విడుదల చేయడానికి హమాస్ పదేపదే నిరాకరిస్తోందని, యుద్ధ లక్ష్యాలను సాధించడానికి గాజాలోని హమాస్ స్థావరాలే లక్ష్యంగా ఐడీఎఫ్ దాడులు చేస్తోందని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇజ్రాయెల్ ఇప్పటినుంచి హమాస్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటు-ందని తెలిపారు. ఈ దాడులను హమాస్ తీవ్రంగా ఖండించింది. టెల్‌అవీవ్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి బందీల ప్రాణాలను ప్రమాదంలో పడేసిందని పేర్కొంది. ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని మిలిటెంట్ సంస్థ హెచ్చరించింది.

# తిరుమల క్యూలైన్ వద్ద ఘర్షణ

**పరస్పరం వాగ్వాదంలో ఒకరికి గాయాలు**

**తిరుమల,మార్చి 20 :** తిరుమల శ్రీవారి దర్శనం కోసం వచ్చిన భక్తుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అది కాస్తా ఘర్షణగా మారింది.చివరకు ఓ భక్తుడు ఆసుపత్రి పాలయ్యాడు. గురువారం తిరుమలలోని సీఆర్వో కార్యాలయం వద్ద భక్తులు క్యూ లైన్‌లో నిల్చున్నారు. ఆ క్రమంలో తన కుమారుడిని తోసిన వ్యక్తిపై అతడి తండ్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆ క్రమంలో ఇద్దరి మధ్య మాట మాట పెరిగింది. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అదే సమయంలో క్యూ లైన్‌లోని వ్యక్తులంతా కలిసి... యువకుడి తండ్రిని కొట్టారు. దీంతో ఆగ్రహించిన ఆ తండ్రి.. తన చేతిలోని గాజు బాటిల్‌తో ఎదుటి వ్యక్తిపై దాడి చేశాడు. తలకు తీవ్ర గాయం కావడంతో.. తోటి భక్తుడు ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న టీటీడీ విజిలెన్స్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ క్రమంలో జరిగిన ఘటనపై ఆరా తీశారు. అనంతరం గాజు సీసాతో దాడి చేసిన వ్యక్తిని వారు అదుపులోకి తీసుకున్నారు. అయితే దాడి కారణంగా ఆసుపత్రిలో చేరిన వ్యక్తికి ప్రాణాపాయం లేదని.. అయితే బలమైన గాయం అయితే అతడికి తగిలిందని వైద్యులు వెల్లడించారు.

# పక్కా ఓటర్ కార్డుకు అడుగు పడాలి

## ఆధార్ మాదిరి ప్రత్యేక ఓటర్ కార్డు రావాలి.. ఎన్నికల సంస్కరణలపై ఇసి దృష్టి పెట్టాలి

**న్యూఢిల్లీ, మార్చి 20:** ఏటా ఓటరు దినోత్సవం జరుపుకుంటున్నా.. ఓటు విషయంలో పక్కా ప్రణాళికలు అమలు కావడం లేదు. ఆధార్, పాన్‌కార్డు పక్కాగా ఉ ంటున్నా...ఓటరు కార్డును నేటికీ పక్కాగా రూపొందించుకోవడం లేదు. తాజాగా వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ఆధార్‌తో ఓటును అనుసంధానం చేస్తామని ఎన్నికల సంఘం ప్రకటించింది. నిజానికి ఈ పని ఎప్పుడో చేయాలి. ఓటు అన్నది ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎంతో విలువైనది. దీనిపై నిర్లక్ష్యం తగదు. ఓటర్ల నమోదు నుంచి దొంగ ఓట్ల వరకు ..ఎక్కడ లోపం ఉందో ఎన్నికల సంఘం ఆలోచించడం లేదు. ఎన్ని ప్రకటనలు గుప్పించినా నేటికీ పక్కాగా ఓటు నమోదు కార్యక్రమాలు జరగడం లేదు. ఓటును ఆధార్‌కు అనుసంధానం చేయాలన్న సంకల్పం నెరవేరడం లేదు. అలాగే పర్మినెంట్ ఓటర్ ఐడి కార్డు నంబర్ ఉంటే తప్ప దొంగ ఓట్లకు స్వస్తి చెప్పలేము. ఓట్లను తొలగించారన్న ఆందోళనలూ తప్పుతాయి. ఈ రెండు అంశాలను ప్రజలు, మేధావులు విస్తృతంగా చర్చించాలి. ఇకపోతే తమ ఓటు పదిలం అన్న భరోసా ప్రజల్లో రావడం లేదు. ఎన్నికల సంఘం ఈ మేరకు అనేక కార్యక్రమాలతో ప్రజల్లో ఓటు చైతన్యానికి కృషి చేయాలి. అయితే సంస్థాగతంగా ఉన్న లోటుపాట్లపై మాత్రం కేంద్ర ఎన్నికల సంఘం దృష్టి సారించడం లేదు. ఓటర్ల నమోదు మొదలుకుని దొంగ ఓట్ల వరకు అనేక అనర్థాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఓటు వేసేందుకు వెళ్లే వరకు ఓటు ఉంటుందో లేదో తెలియడం లేదు. ఆధార్ నమోదు చేసుకున్నట్లుగానే పర్మినెంట్ నంబర్ ఉండాలి. పాన్ కార్డు నమోదయితే పర్మినెంట్ నంబర్ ఉంటుంది. ఓటుకు పర్మినెంట్ నంబర్ రావాల్సి ఉన్నా ఎందుకనో ప్రభుత్వం లేదా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడం లేదు. ఓటుకు ఆధార్ అనుసంధానం చేయడం ద్వారా ఓటును కూడా పర్మినెంట్ చేయాలి. ఇదే సందర్భంలో ఓటుకు కూడా ఆధార్ లాగా పర్మినెంట్ నంబర్ కూడా కేటాయిస్తే మరీ మంచిది. అప్పుడు బోగస్ అన్నదానికి చెక్ పెట్టగలం. ఎన్నికల సంస్కరణలను ఆషామాషీగా కాకుండా పక్కాగా అమలు చేస్తేనే మంచిది. ఓటుకు కూడా ఆధార్ లాగా పర్మినెంట్ నంబర్ ఉంటే ఇలాంటి తొలగింపు అవకాశాలు ఉండవు. ఎలాంటి లోటుపాట్లు లేని ఓటరు నమోదుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఎన్నికల సంఘం గుర్తించడం లేదు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాంగ వ్యవస్థగా ఉన్న ఎన్నికల సంఘం ఈ మధ్య అనేక వివాదాల్లో చిక్కుకుంటోంది. విపరీతమైన అధికారాలు కలిగి ఉన్నా సమర్థత ప్రదర్శించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలు ప్రాణప్రదమైనవి. ఓటర్ల జాబితాలు ఎంత స్వచ్ఛంగా, దోషరహితంగా ఉంటే ఎన్నికలు అంత సవ్యంగా జరుగుతాయి. కానీ ఇప్పుడదే వివాదంగా మారింది. ఓటర్ల నమోదు, తొలగింపు ఓ ప్రహసనంగా




మారింది. పక్కా కార్యాచరణ జరగడం లేదు. శేషన్ లాగా బూజు దులిపి హంటర్ చేతబట్టిన వారు తరవాతి కాలంలో రాలేదు. ఓటర్ల నమోదు, తొలగింపు, నిర్వహణ అంతా వివాదాల్లో నడుస్తోంది. ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్ప క్షపాతంగా నిర్వహించడం ఈ సంస్థ నైతిక బాధ్యత. ఓటర్ల జాబితాలలో అనేక అవక తవకులు బయటపడుతున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి పైనా, రాష్ట్రప్రభుత్వ సిబ్బంది పైనా ఆధారపడి చర్యలు తీసుకోవలసి ఉంటుంది. రాష్ట్ర అధికారులు సహజంగానే అధికారపార్టీకి విధేయంగా ఉ ంటారు. అటువంటప్పుడు అధికారపార్టీ బుద్ధిపూర్వకంగా రకరకాల ఎన్నికల అక్రమాలకు ఒడిగట్టితే వాటిని ఎన్నికల కమిషన్ ఏవిధంగా నివారించగలదనే సందేహం కలుగుతోంది. ఏటా జాతీయ ఓటరు దినోత్సవం జరుపుకుంటున్న వేళ ఓటర్ల సవరణపై కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు వచ్చిన ఆరోపణలను గమనించి సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి. ఓటర్ల తొలగింపు ఇప్పుడు పెద్ద సమస్యగా పరిణమించింది. దీనిని ఏ విధంగా చక్కదిద్దుతారో తెలియడం లేదు. ఓటరు ఐడి కార్డు పట్టుకుని వెళితే జాబితాలో పేర్లు ఉండడం లేదు. దీనికి పక్కా విధానం అమలు కావాల్సి ఉంది. దొంగ ఓట్ల విషయంలో కూడా ఇసి సరైన చర్యలు తీసుకోవడం లేదు. ఓట్ల నమోదులో కొన్ని రాజకీయ పక్షాలు అదే పనిమీద ఉంటాయి. అధికార పార్టీ నేతలు బోగస్ ఓట్లను చేర్పించేందుకు ప్రత్యేక కార్యక్ర మాన్ని ముమ్మరంగా కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు అన్నచోట్లా వున్నాయి. సర్వేల పేరిట జరుగుతున్న తతంగం కూడా అధికార పార్టీ నేతల పర్యవేక్షణలోనే సాగుతోందని ప్రతిపక్షాలు అంటున్నాయి. రెవెన్యూ అధికారులు ఎటువంటి విచారణ లేకుండానే బోగస్ ఓటర్లను నమోదు చేసుకుంటున్నారంటూ ఆరోపణలు వస్తున్నాయి. దొంగ ఓట్లు ఫలానా ప్రాంతంలో ఉన్నాయనీ, దర్యాప్తు జరిపించి నిజం నిగ్గు తేల్చాలనీ ఎన్నికల ప్రధానాధికారి జిల్లా ఎన్నికల అధికారిని ఆదేశిస్తే చక్కదిద్దు తారన్న భరోసా లేదు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలి. అప్పుడే ఇసి సక్రమంగా ముందుకు వెళ్లగలదు. అధికారుల పరిశీలనలో దొంగ ఓట్లు నమోదైనట్టు రుజువైతే తప్ప చర్యలకు ఉపక్రమించడం లేదు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా నామినేషన్ వేయడానికి గడువు ముగిసే క్షణం వరకూ కొత్త ఓట్లను చేర్చుకునే ప్రక్రియ కొనసాగుతోంది. ఇకపోతే రాజకీయ పార్టీల ప్రమేయంతో ఓట్ల తొలగింపు జరుగుతోందన్న వాదన ఉంది. దీనిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. దొంగ ఓట్లను తొలగించాలనే పట్టుదల కేంద్ర ఎన్నికల కమిషన్‌కు నిజంగా ఉంటే అందుకోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. అంకిత భావంతో పనిచేసే సిబ్బందిని తగినంతగా సమకూర్చాలని రాష్ట్రపతిని అభ్యర్థించాలి. నామినేషన్ల గడువు మ- ుగియడానికి ముందు ఉన్న ఓట్లకు పదిహేను లేదా ఇరవై శాతం కొత్త ఓట్లు నమోదు చేస్తున్నారు. నామినేషన్లు ముగిసిన తర్వాత దొంగ ఓట్లను గుర్తించి, తొలగించడానికి తగిన సమయం ఉండటం లేదు. అక్రమాలు జరిగినట్టు తెలుసుకొని ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత అధికారులపైన ఎటువంటి చర్య తీసుకున్నా లాభం ఉ ండదు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్లకు మంచి పేరు ఉన్నప్పటికీ ఎన్నికలలో ధన ప్రభావం విపరీతంగా పెరిగింది. అక్రమాలకు అంతులేకుండా పోతున్నది. అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడం యథావిధిగా జరుగుతోంది. గతానుభవాను దృష్టిలో పెట్టుకుని పక్కాగా ఓటరు నమోదు కార్యక్రమం ఉండాలి. అవసరమైతే సాంకేతి కతను మరింతగా ఉపయోగించు కోవాలి. ఎన్నికలలో అవకతవకలకు పాల్పడిన అధికారులు ఎంతవారైనా వారిపైన చర్యలు తప్పవన్న హెచ్చరికలు కఠినంగా అమలు కావాలి. అప్పుడే భయం ఏర్పడుతుంది. అందుకు ఎన్నికల సంఘం ముందుకు వస్తుందా అన్నది చూడాలి. ఆధార్‌తో ఓటర్ ఐడీ అనుసంధానం ద్వారా దాన్ని పరిష్కరించడానికి అవకాశం ఏర్పడు తుంది. అయితే ఆధార్ కార్డు లాగానే ఓటరు ఐడికి కూడా పర్మినెంట్ నంబర్ ఉంటే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు. ఇలా చేయడం వల్ల ఓటును కోల్పోవడం లేదా..బోగస్‌ను నివారించవచ్చని అంటున్నారు. ఆధార కార్డు మాదరిగా ఓటర్ ఐడికి నంబర్ ఉంటే మంచిదని అంటున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా.. ఓటు పరమపవిత్రంగా ఉ ండేలా...ఒకరి ఓటు మరొకరు వేయకుండా..ఓటును అకారణంగా తొలగించకుండా కూడా గట్టి చర్యలు తీసుకోవాలి. ఓటరు దినోత్సవం జరుపుకుంటున్న వేళ కఠిన సంస్కరణలతో ఎన్నికల సంఘం ముందుకు సాగాల్సి ఉంది.



# ఉలిక్కి పడేలా చేస్తున్న బంగారం, వెండి ధరలు..

**బిజినెస్ న్యూస్:** బుధవారం జీవిత కాల గరిష్ఠానికి చేరిన బంగారం ధర గురువారం (20-03-2025) రోజు స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. అంతర్జాతీయ మార్కెట్ల ప్రభావంతో నిన్న 10 గ్రాముల గోల్డ్ ధర ఏకంగా రూ.90 వేలకు పెరిగి కొనుగోలు దారులకు భారీ షాక్ ఇచ్చింది. అయితే ఇవాళ ఉదయం 06:30 గంటల సమయానికి దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.88,660 ఉండగా.. 22 క్యారెట్ల తులం గోల్డ్ రేటు రూ.81,272గా ఉంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.88,820 కాగా.. 22 క్యారెట్ల తులం గోల్డ్ రేటు రూ.81,418గా ఉంది. ఇక హైదరాబాద్, విజయవాడ, విశాఖ నగరాల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.88,960 చేరుకోగా.. 22 క్యారెట్ల తులం పసిడి రేటు రూ.81,547గా ఉంది.

బంగారం ధరలు ఇవాళ స్వల్పంగా తగ్గినప్పటికీ గతేడాదితో పోలిస్తే భారీగానే పెరుగుతూ వస్తోంది. అయితే అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి పగ్గాలు చేపట్టిన తర్వాత పసిడి ధర ఉట్టెక్కింది. ఆయన తీసుకుంటున్న వరస సంచలన నిర్ణయాలతో అంతర్జాతీయ మార్కెట్లు బెంబేలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే మదుపరులంతా గోల్డ్‌ని సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. తాజాగా ట్రంప్ తీసుకున్న మరో నిర్ణయం బంగారానికి డిమాండ్ భారీగా పెంచింది. దిగుమతి సుంకాలను ట్రంప్ భారీగా పెంచారు. దీంతో పెట్టుబడుదారులంతా ఒక్కసారిగా పసిడి వైపు మొగ్గు చూపడంతో రేటు అమాంతం పెరిగిపోయింది.

**దేశవ్యాప్తంగా బంగారం (22, 24 క్యారెట్ల) ధరలు ఎలా ఉన్నాయంటే..**

కోల్‌కతా- రూ.81,308, రూ.88,700
చెన్నై- రూ.81,648, రూ.89,070
బెంగళూరు- రూ.81,483, రూ.88,890
పుణె- రూ.81,418, రూ.88,820
అహ్మదాబాద్- రూ.81,519, రూ.88,930
భోపాల్- రూ.81,501, రూ.88,910
కోయంబత్తూర్- రూ.81,648, రూ.89,070
పట్నా- రూ.81,373, రూ.88,770
సూరత్- రూ.81,519, రూ.88,930
పుదుచ్చేరి- రూ.81,703, రూ.89,130

**వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..**

దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ.99,790కు చేరింది. ఆర్థిక రాజధాని ముంబైలో కేజీ రేటు రూ.99,960గా ఉంది. ఇక హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో కిలో వెండి రికార్డు ధర పలుకుతోంది. ఏకంగా రూ.లక్ష దాటి రూ.100,120 వద్ద కొనసాగుతోంది.

# ఉక్కు దిగుమతులపై 12% సుంకం!

## కేంద్ర వాణిజ్య శాఖ సిఫారసు



న్యూఢిల్లీ: దేశీయ ఉక్కు తయారీదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు విదేశాల నుంచి దిగుమతయ్యే కొన్ని స్టీల్ ఉత్పత్తులపై 200 రోజులపాటు 12 శాతం తాత్కాలిక రక్షణ సుంకం విధించాలని కేంద్ర వాణిజ్య శాఖకు చెందిన దర్యాప్తు విభాగం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమిడీస (డీజీటీఆర్) సిఫారసు చేసింది. పలు పరిశ్రమల్లో ఉపయోగించే నాన్ అల్లాయ్, అల్లాయ్ స్టీల్ ఫ్లాట్ ఉత్పత్తుల దిగుమతులు ఒక్కసారిగా పెరగడంతో ఇండియన్ స్టీల్ అసోసియేషన్ చేసిన ఫిర్యాదు మేరకు గత ఏడాది డిసెంబరులో డీజీటీఆర్ దర్యా ప్తు ప్రారంభించింది. ఈ ఉత్పత్తుల దిగుమతు లు ఆకస్మికంగా, వేగం గా పెరిగాయని, ఇది దేశీయ స్టీల్ తయారీదారులకు నష్టం చేకూర్చే ప్రమాదం ఉ ందని డీజీటీఆర్ ప్రాథమిక దర్యాప్తులో తేలింది. దేశీయ సంస్థల ప్రయోజనాలను కాపాడేందుకు విదేశాల నుంచి దిగుమతి అవుతున్న స్టీల్ ఉ త్పత్తులపై 12 శాతం సుంకం విధించాలని ఈనెల 18న జారీ చేసిన నోటిఫికేషన్‌లో డీజీటీఆర్ సిఫారసు చేసింది. ఈ ప్రతిపాదనపై కేంద్ర ఆర్థిక శాఖ తుది నిర్ణయం తీసుకోనుంది. స్టీల్ స్టాక్స్ జూమ్: ఈ ప్రతిపాదనతో బుధవారం స్టీల్ రంగ కంపెనీల షేర్లు భారీగా పుంజుకున్నాయి. ఎన్ఎండీసీ షేరు ఏకంగా 6.88 శాతం ఎగబాకింది. సెయిల్ 3.99 శాతం, టాటా స్టీల్ 2.52 శాతం, జేఎస‌డబ్ల్యూ స్టీల్ 1.33 శాతం, జిందాల్ స్టెయిల్‌నెస్ 1.15 శాతం, జిందాల్ స్టీల్ అండ్ పవర్ 0.25 శాతం పెరిగాయి.

# ఏప్రిల్ 1 నుంచి రానున్న మార్పులివే...




2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌ను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో మధ్య తరగతి వారికి ఆదాయపు పన్నులో భారీ ఉ పశమనంతో పాటు అనేక నియమాలలో కీలక మార్పులు చేశారు. ఇవి ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి.. అంటే 2025, ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి రానున్నాయి. ఈ మార్పులో పన్ను మినహాయింపు (TDS)తోపాటు మూలం పన్ను వసూలు (TCS) కోసం కొత్త నియమాలు సైతం ఉన్నాయి.

**వృద్ధులు,ఇంటి యజమానులకు పెద్ద ఉపశమనం**

సీనియర్ సిటిజన్లకు టీడీఎస్ తగ్గింపును రెట్టింపు చేసింది. గతంలో ఇది రూ. 50 వేలుగా ఉండేది. ప్రస్తుతం అది రూ. లక్షకు చేరింది. ప్రస్తుతం ఇది గొప్ప ఉపశమనంగా మారింది. అదే సమయంలో..ఇంటి యజమానులకు సైతం పెద్ద ఉపశమనం లభించింది. అదేమంటే..అద్దె ఆదాయంపై TDS మినహాయింపు పరిమితిని ఈ ఆర్థిక సంవత్సరానికి రూ. 2.4 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచారు.

**విదేశీ లావాదేవీలపై టీసీఎస్ పరిమితి పెంపు**

విదేశాల నుంచి లావాదేవీలు చేసే వారికి RBI సరళీకృత రెమిటెన్స్ పథకానికి TCS తగ్గింపు పరిమితిని కూడా పెంచారు. గతంలో విదేశాల నుంచి జరిగే లావాదేవీలపై టీసీఎస్‌ను రూ.7 లక్షలకు తగ్గించే వారు, అయితే ప్రస్తుతం దానిని రూ.10 లక్షలకు పెంచారు.

**విద్యా రుణంపై TDS తొలగించబడింది**

నిర్దిష్ట ఆర్థిక సంస్థల నుంచి విద్యా రుణంపై TCS మినహాయింపు తొలగించారు. గతంలో రూ.7లక్షల కంటే ఎక్కువ విద్యా రుణాలపై 0.5% TCS తగ్గించబడేది, అయితే రూ.7 లక్షల కంటే ఎక్కువ విద్యా లావాదేవీలపై 5% TCS తగ్గించబడింది.

**డివిడెండ్, మ్యూచువల్ ఫండ్ ఆదాయాలపై పరిమితి**

డివిడెండ్ ఆదాయంపై టీడీఎస్ పరిమితిని రూ.5,000 నుంచి రూ.10,000కి పెంచారు, మ్యూచువల్ ఫండ్ యూనిట్ల నుంచి వచ్చే ఆదాయంపై టీడీఎస్ పరిమితిని కూడా ఆర్థిక సంవత్సరానికి రూ.5,000 నుంచి రూ.10,000కి పెంచారు. ఇది కాకుండా..బహుమతికి TDSను రూ.10,000కు పెంచారు.

**గ్యాస్ ధర**

చమురు కంపెనీలు ప్రతి నెల మొదటి తేదీన LPG ధరలను సమీక్షిస్తాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1వ తేదీ తెల్లవారుజామున సిలిండర్ ధరలలో మార్పులు సంభవించే అవకాశముంది.

**ATF మరియు CNG-PNG రేట్లు**

ప్రతి నెలా మొదటి తేదీన, చమురు కంపెనీలు విమాన ఇంధనం ధరలలో అంటే ఎయిర్ టర్బైన్ ఇంధనం (ATF), CNG-PNG ధరలలో సైతం కొన్ని మార్పులు తీసుకు రానున్నాయి.

# ఓలా ఎలక్ట్రిక్‌కు మరో షాక్

న్యూఢిల్లీ: ఓలా ఎలక్ట్రిక్ ప్రకటించిన విక్రయ గణాంకాలు, వాస్తవ రిజిస్ట్రేషన్లలో భారీ వ్యత్యాసంతో పాటు కంపెనీపై పెరుగుతున్న ఫిర్యాదులపై దర్యాప్తు జరిపి, 15 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆటోమోటివ్ రీసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ)ను కేంద్ర భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ కోరినట్లు తెలిసింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలకు వాహన్ పోర్టల్‌లో కేవలం 8,652 ఓలా ఎలక్ట్రిక్ స్కూటర్ల రిజిస్ట్రేషన్లు నమోదు కాగా.. కంపెనీ మాత్రం ఆ నెలలో 25,000కు పైగా వాహనాలను విక్రయించినట్లు ప్రకటించింది. ఈ నెలలోనూ 20వ తేదీవరకు కంపెనీ రిజిస్ట్రేషన్లు 11,781 యూనిట్లుగా నమోదయ్యాయి. దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రకటించిన ఫేమ్ రెండో విడత పథకంతో పాటు పీఎం ఈ-డ్రైవ్ స్కీమ్ లబ్దిదారుల్లో ఓలా ఎలక్ట్రిక్ ఒకటి. భారీ పరిశ్రమల శాఖ పర్యవేక్షణ పరిధిలోని సర్టిఫికేషన్, టెస్టింగ్ ఏజెన్సీ అయిన ఏఆర్ఏఐనే ఓలా ఎలక్ట్రిక్‌కు ఈ పథకాలకు సంబంధించిన అర్హత పత్రం జారీ చేసింది. అందుకే కంపెనీపై దర్యాప్తు చేపట్టాలని కేంద్రం ఏఆర్ఏఐని నిర్దేశించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వాహనాల్లో తయారీ లోపాలు, వాహన సర్వీసింగ్ సేవలు అందుబాటులో లేకపోవడంపై కస్టమర్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఏజెన్సీ సీసీపీఏ ఇప్పటికే ఓలా ఎలక్ట్రిక్‌పై దర్యాప్తునకు ఆదేశించింది.



# హెచ్ సీఏలో భారీ అవినీతి..

## రూ.90లక్షలకుపైగా నిధుల దుర్వినియోగం




హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్ సీఏ)లో భారీ అవినీతి జరిగింది. ఉప్పల్ రాజీవ్ గాంధీ స్టేడియానికి సంబంధించి కొనుగోళ్లలో క్విడ్ ప్రోకో జరిగిందని తాజాగా ఈడీ జరిపిన విచారణలో తేలింది. రూ.90లక్షలకుపైగా నిధుల దుర్వినియోగం జరిగినట్లు తెలుస్తోంది. అప్పటి హెచ్ సీఏ వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్ సురేందర్ అగర్వాల్ కుటుంబంతో ఈ కుంభకోణానికి సంబంధాలు ఉన్నట్లు తేలింది. క్రికెట్ బాల్స్, జిమ్ పరికరాలు, బకెట్ కుర్చీల కొనుగోళ్లలో క్విడ్ ప్రొకో జరిగినట్టు గుర్తించింది. కాంట్రాక్ట్ కంపెనీల నుంచి సురేందర్ అగర్వాల్ కుటుంబ సభ్యుల అకౌంట్లకు మనీలాండరింగ్ జరిగినట్టు ఆధారాలు గుర్తించింది. దీంతో సురేందర్ అగర్వాల్, ఆయన భార్య, కొడుకు, కోడలికి చెందిన రూ.51.29 లక్షల విలువైన ఆస్తులను సీజ్ చేసింది. ఈ మేరకు ఈడీ హైదరాబాద్ జోనల్ ఆఫీస్ తాజాగా ప్రకటన వెలువరించింది. భారత మాజీ కెప్టెన్ అజహరుద్దీన్ హెచ్‌సీఏ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో వైస్ ప్రెసిండెంట్, ట్రెజరర్‌గా సురేందర్ అగర్వాల్ వ్యవహరించారు. వీరి హయాంలో 2019%-%2022 సంవత్సరాలకు గాను బీసీసీఐ నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో ఉప్పల్ రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో అవసరమైన క్రికెట్ బాల్స్, జిమ్ పరికరాలు, బకెట్ కుర్చీలు, అగ్నిమాపక పరికరాలు పర్చేజ్ చేశారు. అయితే ఈ నిధుల్లో భారీగా అక్రమాలు జరిగినట్టు అప్పటి ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్ట్‌లో వివరాలు బయటకు వచ్చాయి. దీంతో 2023 అక్టోబర్‌లో హెచ్‌సీఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఉప్పల్ పోలీసులు నాలుగు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఈడీ.. మనీలాండరింగ్ కోణంలో నిధుల దుర్వినియోగంపై దర్యాప్తు చేసి, వివరాలు సేకరించింది. ఉప్పల్ స్టేడియానికి పరకరాల సప్లయ్ చేసేందుకు సారా స్పోర్ట్స్, ఎక్సలెంట్ ఎంటర్‌ప్రైజెస్, బాడీ డ్రెంచ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలకు కాంట్రాక్టులు ఇచ్చారు. సాధారణం కంటే కుట్రపూరితంగా అధిక ధరలతో లావాదేవీలు నిర్వహించడంతో, ఇలా అక్రమంగా వచ్చిన లాభాలు ఆయా కంపెనీల నుంచి సురేందర్ కుటుంబ సభ్యులకు బదిలీ అయ్యాయి. సురేందర్ భార్య పేరుతో ఉన్న కేబీ జ్యువెలర్స్‌కు, ఆయన కొడుకు అక్షిత్ అగర్వాల్ వ్యక్తిగత బ్యాంక్ అకౌంట్లకు సారా స్పోర్ట్స్ అకౌంట్ నుంచి రూ.17 లక్షలు జమ అయ్యాయి. అలాగే మరో సంస్థ ఎక్సలెంట్ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా అక్షిత్ అకౌంట్‌కు రూ. 21.86 లక్షలు డిపాజిట్ అయ్యాయి. అలాగే బాడీ డ్రెంచ్ ఇండియా అకౌంట్ నుంచి రూ. 52 లక్షలు బదిలీ అయ్యాయని దర్యాప్తులో తేలింది. ఇలా క్విడ్ ప్రో కో విధానంలో సురేందర్ కుటుంబ సభ్యులకు మొత్తం రూ. 90.86 లక్షలు చేరినట్టు ఆధారాలు సేకరించింది. దీని అధారంగా కేసు నమోదు చేసిన ఈడీ, దర్యాప్తు చేస్తోంది. అయితే తాజాగా ఈ కుంభకోణంపై క్రికెట్ ప్రేమికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే దేశవాళీలో హైదరబాద్ జట్టు ఆటతీరు అంతంతమాత్రమేనని, ఇక ఇలాంటి కుంభకోణాలతో అటు హైదరాబాద్, ఇటు తెలంగాణ పరువు మంట కలిసిందని వాపోతున్నరు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఐపీఎల్ కప్పు కోసం రికీ పాంటింగ్ పూజలు!



ఐపీఎల్ 2025 కోసం అన్ని టీమ్స్ ప్రాక్టీస్ చేస్తుంటే ఓ టీమ్ మాత్రం పూజలు చేస్తోంది. అది కూడా ఏ సాధారణ పూజలు కాదు.. పెద్ద పెద్ద హోమాల రేంజ్‌లో చేస్తున్నారు. ఆ పూజలు చూస్తే ప్రత్యర్థులు కూడా భయపడి వారితో మ్యాచ్‌లు ఓడిపోయేలా ఉన్నాయి. పంజాబ్ కింగ్స్ ఐపీఎల్ పుట్టినప్పటి నుంచి ఆడుతన్నా.. ఒక్కసారి కూడా ట్రోఫీ గెలవలేదు. వారితో పాటు ఢిల్లీ క్యాపిటల్స్, ఆర్సీబీ కూడా కప్పు కొట్టకపోయినా.. వాళ్లకున్నంత ఫ్యాన్ బేస్ కూడా పంజాబ్‌కు లేదని చెప్పు కోవచ్చు. ట్రోఫీ గెలిచేందుకు వాళ్లు చాలా సార్లు టీమ్‌లను మార్చేశారు. కెప్టెన్లను ఎన్ని సార్లు మార్చారో లెక్కలేదు. అలాగే అనేక సార్లు జెర్సీలు, జెర్సీ రంగులు, లోగోలు ఏకంగా టీమ్ పేరు కూడా మార్చుకున్నారు. ఎన్ని మార్చినా, ఏం చేసినా వాళ్లకు కప్పు మాత్రం రాలేదు. అయితే ఈ సారి మాత్రం కప్పు కచ్చితంగా కొట్టాలనే ఉద్దేశంతో ఏకంగా భారీ భారీ పూజలు కూడా చేస్తున్నారు.అయితే ఈ పూజలో పంజాబ్ కింగ్స్ ఆటగాళ్లతో పాటు ఆ జట్టు హెడ్ కోచ్, ఆస్ట్రేలియా దిగ్గజ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ పాల్గొన్నాడు. అక్కడున్న పూజారులు పూజలు చేయిస్తుంటే.. ఆయన పూజలో పాల్గొన్నారు. ఈ పూజలు చూస్తుంటే ఈ సారి కప్పు పంజాబ్ కొట్టేలా ఉందని అభిమానులు సరదాగా కామెంట్ చేస్తున్నారు. మరి ఈ పూజలు పంజాబ్ కింగ్స్‌కు ఎంత వరకు కలిసి వస్తాయో, వారికి మొదటి ఐపీఎల్ ట్రోఫీని అందిస్తాయో లేదో చూడాలి. ఇక పోతే పంజాబ్ కింగ్స్ టీమ్‌కు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా ఉన్న విషయం తెలిసిందే. ఓవరాల్‌గా పంజాబ్ టీమ్ కూడా బాగుంది.



# బంతికి ఉమ్మి రాయడంపై నిషేధం తొలగింపు

## ఐపీఎల్ కు బీసిసిఐ గ్రీన్ సిగ్నల్

ఐపీఎల్ 2025 సీజన్ మార్చి 22 నుంచి ప్రారంభంకానుంది. ఈ క్రమంలో ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా బీసీసీఐ ఓ నిర్ణయం తీసుకుంది. బంతికి ఉమ్మి రాయడంపై ఉన్న నిషేధాన్ని తొలగించింది. గురువారం ముంబయిలో ఐపీఎల్ కెప్టెన్ల సమావేశం జరిగింది. మెజారిటీ కెప్టెన్‌లు బంతికి లాలజలం రాయడంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయాలనే ప్రతిపాదనకు అంగీకరించారు. దీంతో బీసీసీఐ తాజా నిర్ణయం తీసుకుంది. బంతిని రివర్స్ స్వింగ్ చేసే క్రమంలో పేసర్లు ఉమ్మిని బంతికి రాస్తుంటారు. ప్రధానంగా టెస్టు క్రికెట్లో దీని ప్రభావం ఎక్కువ. కానీ, కరోనా సమయంలో ఐసీసీ బంతిపై ఉమ్మి రాయడాన్ని నిషేధించింది. తర్వాత ఐపీఎల్‌లోనూ దీన్ని అమలు చేశారు. భారత స్టార్ పేసర్ మహ్మద్ షమి, టిమ్ సౌథీతో పాటు చాలా మంది పేసర్లు ఈ మధ్య ఉమ్మిపై నిషేధాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ఐపీఎల్‌లో నిషేధం ఎత్తివేయడం వల్ల ఐసీసీ కూడా ఆ దిశగా చర్యలు తీసుకోక తప్పకపోవచ్చు. కోవిడ్ పరిస్థితుల నేపథ్యంలో సలైవా వాడటంపై నిషేధం విధించారని, ఇప్పుడు పరిస్థితులు మెరుగు పడిన నేపథ్యంలో తిరిగి ఆ వెసులుబాటును కల్పించాలని పలువురు క్రికెటర్లు కోరుతున్నారు. భారత్ వెటరన్ మహ్మద్ షమీ, సౌతాఫ్రికా మాజీ పేసర్ వెర్నన్ ఫిలాండర్, న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ టిమ్ సౌతీ ఈ వెసులుబాటును కలిపించాలని ఐసీసీని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐపీఎల్లో ఈ వెసులుబాటును కల్పించడం, చాలామంది బౌలర్లు ఊరట కలిగించనుంది. నిజానికి టెస్టుల్లో ఈ వెసులుబాటు వల్ల ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. అయితే వైట్ బాల్ క్రికెట్లో కూడా ఎంతో కొంత ప్రయోజనం ఉంటుందనే నేపథ్యంలోనే ఐపీఎల్ యాజమాన్యం ఈ నిర్ణయం వైపు మొగ్గు చూపిందనే టాక్ నడుస్తోంది. ఇప్పటివరకు డీఆరెస్ అంటే డెసిషన్ రివ్యూ సిస్టమ్ ను కేవలం ఔట్, నాటౌట్ , నోబాల్, వైడ్ బాల్ వరకే లీగ్ లో వాడేవారు. ఈ ఎడిషన్ నుంచి హైట్ వైడ్ బాల్ కు కూడా వాడనున్నట్లు తెలుస్తోంది. బ్యాటర్ పై నుంచి బంతి వెళ్లినప్పుడు అది వైడ్ బాల్, అవునో కాదో తేల్చేందుకు డీఆరెస్ ను వాడేందుకు ఆటగాళ్లకు అనుమతి లభించనుంది. ఈ క్రమంలో ఆట మరింత ఆసక్తిగా మారనుంది. తాజాగా ఈ నిబంధన గురించి కూడా మీటింగ్ లో చర్చించే అవకాశముంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే, ఈ నిబంధనను అమలు పరిచే అవకాశాలే ఎక్కువగాఉన్నాయి. ఈనెల 22 నుంచి ఐపీఎల్ ప్రారంభమవుతుండగా, తొలి మ్యాచ్ లో డిఫెండింగ్ చాంపియన్ కోల్ కతా నైట్ రైడర్స్ తో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. కోల్ కతా లోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా తలపడనుంది.

# సీఎస్‌కేను మరో రెండేళ్లు నిషేధించండి!

## చెన్నై జట్టు అభిమానుల డిమాండ్

చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) ఫ్రాంచైజీని మరో రెండేళ్ల పాటు నిషేధించాలని ఆ జట్టు అభిమానులే డిమాండ్ చేస్తున్నారు. ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ ఫ్రాంచైజీ.. టికెట్ల విషయంలో అభిమానులను దారుణంగా మోసం చేసిందని ఆరోపిస్తున్నారు. టికెట్లను అధిక ధరలకు విక్రయించడమే కాకుండా.. సగం టికెట్లను మాత్రమే ఆన్‌లైన్‌లో పెట్టారని మండిపడుతున్నారు.ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా మార్చి 23(ఆదివారం)న చెపాక్ మైదానం వేదికగా ముంబై ఇండియన్స్‌తో చెన్నై సూపర్ కింగ్స్ తొలి మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్ల అమ్మకాలు బుధవారమే ప్రారంభమయ్యాయి. చెన్నై చెపాక్ స్టేడియానికి 40 వేల సీటింగ్ కెపాసిటీ ఉండగా.. ఇందులో 35వేలకు పైగా టికెట్లను ఆన్‌లైన్ ద్వారా విక్రయించాలి.అయితే ఆన్‌లైన్‌లో రిలీజ్ చేసిన క్షణాల్లోనే టికెట్లన్నీ అయిపోయాయి. టికెట్ల కోసం గంటలకొద్దీ ఆన్‌లైన్ వేదికగా వేచి ఉన్నా.. దొరకలేదని, అసలు టికెట్లు ఆన్‌లైన్ ద్వారా అమ్మడం లేదని సీఎస్‌కే ఫ్యాన్స్ ఆరోపిస్తున్నారు. స్టేడియంలోని సగం టికెట్లను తెలిసిన వారికే ఇస్తున్నారని, మరికొన్ని బ్లాక్‌లో అమ్ముతున్నారని ఫ్యాన్స్ అసహనం వ్యక్తం చేస్తున్నారు. 40 వేల టికెట్లు మాత్రమే ఉండగా.. ఈ మ్యాచ్ కోసం రెండు లక్షల యాభై వేల మంది వేచి చూసినట్లు గణంకాలు చెబుతున్నాయి. చెన్నైలో ధోనీకి ఫుల్ క్రేజ్ ఉండటంతో పాటు ముంబై ఇండియన్స్ తరఫున రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ బరిలోకి దిగుతుండటం కూడా టికెట్లను డిమాండ్‌ను అమాంతం పెంచినట్లు తెలుస్తోంది.చెపాక్ స్టేడియంలో కనీస టికెట్ ధరనే రూ. 1400గా ఉండగా.. బ్లాక్‌లో ఒక్కో టికెట్‌ను 10 రెట్లు పెంచి అమ్ముతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే చెన్నై సూపర్ కింగ్స్‌ను మరో రెండేళ్ల పాటు నిషేధం విధించాలని సోషల్ మీడియా వేదికగా ఫ్యాన్స్ డిమాండ్ చేస్తున్నారు. గతంలో స్పాట్ ఫిక్సింగ్ ఉదంతం నేపథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో పాటు రాజస్థాన్ రాయల్స్‌పై రెండేళ్ల పాటు నిషేధం విధించిన విషయం తెలిసిందే.

# మైదానంలో నాకు అండగా నిలవండి

## ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా

ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తమ అభిమానులకు ఓ అభ్యర్థన చేశాడు. ఈ సారి తాను మైదానంలోకి అడుగుపెట్టినప్పుడు హేళన చేయకుండా అండగా నిలవాలని కోరాడు. బ్యాటింగ్ చేసే సమయంలో.. టాస్ సందర్భంగా మైదానంలోకి వచ్చినప్పుడు తనను ఎంకరేజ్ చేయాలని రిక్వెస్ట్ చేశాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో హార్దిక్ పాండ్యాను సొంత అభిమానులే గేలి చేసిన సంగతి తెలిసిందే. రోహిత్ శర్మను కాదని ముంబై ఇండియన్స్ సారథ్య బాధ్యతలను హార్దిక్ పాండ్యాకు కట్టబెట్టడాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. సీజన్ మొత్తం అతనిపై విమర్శలు గుప్పించారు. టాస్ సమయంలో.. బ్యాటింగ్ చేసేటప్పుడు రోహిత్ అని గట్టిగా అరుస్తూ దారుణంగా అవమానించారు. కెప్టెన్సీ ఆఫర్‌తోనే గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై ఇండియన్స్‌లోకి వచ్చాడని, హార్దిక్ కారణంగానే రోహిత్ సారథ్యం కోల్పోయాడని ఫ్యాన్స్ ఆగ్రహానికి గురయ్యారు. ఆ సీజన్‌లో ముంబై ఇండియన్స్ దారుణంగా విఫలమై పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. సొంత అభిమానుల చేత ఘోర అవమానానికి గురైన హార్దిక్ పాండ్యా తీవ్ర మానసిక క్షోభను అనుభవించాడు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి అద్భుతంగా పుంజుకొని టీమిండియా టీ20 ప్రపంచకప్ 2024, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు ముంబై ఇండియన్స్ కూడా హార్దిక్ పాండ్యానే కెప్టెన్‌గా కొనసాగించింది. ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభానికి ముందు మీడియాతో మాట్లాడిన హార్దిక్ పాండ్యా అభిమానులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశాడు. 'నేను బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు నన్ను ప్రోత్సహించండి. నేను సిక్స్ కొట్టినప్పుడు గట్టిగా అరుస్తూ మరింత మద్దతు తెలపండి. టాస్ కోసం వచ్చినప్పుడు.. బౌలింగ్ చేస్తున్నప్పుడు కూడా నాకు అండగా నిలవండి. వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్ జెర్సీ కలర్ తప్పా మరే రంగును చూడకూడదనుకుంటున్నా. మిమ్మల్ని నేను కోరేది ఒక్కటే.'అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు. ఈ వ్యాఖ్యలు గతేడాది అతనికి జరిగిన అవమానాన్ని మరిచిపోలేదనే విషయాన్ని సూచిస్తున్నాయి. నిషేధం కారణంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరమయ్యాడు. అతని స్థానంలో సూర్యకుమార్ యాదవ్ జట్టును నడిపించనున్నాడు.





## చిల్లింగ్ మూడ్‌లో అందాల రకుల్

కన్నడ మూవీ గిల్లితో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. మొదటి సినిమాతో నటిగా మంచి గుర్తింపు దక్కించుకోవడంతో టాలీవుడ్‌లో 'కెరటం' సినిమాతో ఎంట్రీ ఇచ్చే అవకాశం దక్కించుకుంది. టాలీవుడ్‌లో మొదటి సినిమా నిరాశ పరచడంతో తదుపరి ఆఫర్ కోసం రెండేళ్లు వెయిట్ చేయాల్సి వచ్చింది. 2013లో సందీప్ కిషన్‌కి జోడీగా వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాలో నటించింది. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, సినిమాలో ఆమె పాత్రకు మంచి ప్రాముఖ్యత లభించింది, పాత్రకు తగ్గట్లుగా రకుల్ ప్రీత్ సింగ్ తన నటనతో మెప్పించింది. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమా తర్వాత రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్‌లో వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. టాలీవుడ్‌లో దాదాపు పదేళ్ల పాటు వరుసగా సినిమాలు చేసింది. ఒకానొక సమయంలో టాలీవుడ్ స్టార్ హీరోలకు సైతం డేట్లు ఇవ్వలేని పరిస్థితిలో రకుల్ ప్రీత్ సింగ్ సినిమాలు చేసింది. టాలీవుడ్‌లోని దాదాపు అందరు స్టార్ హీరోల సినిమాల్లోనూ రకుల్ ప్రీత్ సింగ్ నటించిన విషయం తెల్సిందే. తెలుగులో ఈ అమ్మడు దశాబ్ద కాలం పాటు వెనక్కి తిరిగి చూసుకోకుండా సినిమాలు చేసింది. కానీ గత కొన్నాళ్లుగా ఈమెకు టాలీవుడ్‌లో ఆఫర్లు కనిపించడం లేదు. టాలీవుడ్‌లో ఆఫర్లు దక్కని సమయంలో బాలీవుడ్‌లో సినిమాలు చేసింది. అక్కడ ఒకే సారి అర డజను సినిమాలు చేయడంతో బిజీ హీరోయిన్‌గా మారింది. కానీ ఆ అరడజను సినిమాల్లో ఒక్కటి కూడా రకుల్ కి హిట్ తెచ్చి పెట్టలేదు.





## బాలీవుడ్‌కు ఫిక్స్ అయిన తాప్సీ

సొట్ట బుగ్గల సుందరి తాప్సీ పన్నుకు యాక్టింగ్ లైఫ్, కెరీర్ ఇచ్చిందే సౌత్ ఇండస్ట్రీ. ముఖ్యంగా టాలీవుడ్ ఆమెకు స్టార్డ్ డమ్ ఇచ్చింది. ఝుమ్మందినాదంతో ఎంట్రీ ఇచ్చిన ఈ ఢిల్లీ డాల్ ప్రభాస్, ధనుష్, వెంకటేశ్, గోపీచంద్, రవితేజ, మోహన్ లాల్, అజిత్ లాంటి సౌత్ స్టార్లతో జోడీ కట్టింది. అంతలో బాలీవుడ్ రమ్మంటే అక్కడకు వెళ్లిపోయింది. ఇక అప్పటి నుండి మేడమ్‌లో ఒరిజినాలిటీ- బయటకు వచ్చింది. నార్త్ బెల్ట్‌కు వెళ్లి టాలీవుడ్‌పై నోరు పారేసుకోవడంతో స్టార్స్‌తో నటించే ఛాన్స్ పోగొట్టు-కున్నట్లయ్యింది. బాలీవుడ్ వెళ్లాక లేడీ ఓరియెంట్ చిత్రాలతో పాపులర్ అయ్యింది తాప్సీ. పింక్, నామ్ షబానా, తప్పడ్, హసీనా దిల్ రుబా, బద్లా లాంటి సినిమాలో ఆమె ఇమేజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. ఈ మధ్యలో తెలుగులో సినిమాలు చేసింది కానీ అవి పెద్దగా ఆడలేదు. ఆనందో బ్రహ్మ తర్వాత చేసిన ఏ తెలుగు సినిమా హిట్ కాలేదు. 2022 తర్వాత మిషన్ ఇంపాజిబుల్ చేశాక టాలీవుడ్ వైపు తొంగి చూడలేదు సొట్టబుగ్గలసుందరి. పూర్తి సేవలు బీటౌన్‌కే అందిస్తోంది. కెరీర్ స్టార్ట్ చేసిన దశాబ్దం దాటిన నార్త్ బెల్ట్‌లో త్రీ ఖాన్స్‌లో కేవలం షారూఖ్‌తో జోడీ కట్టింది తాప్సీ. సీనియర్ల కంటే జూనియర్లే బెటర్ అనుకుందేమో ఎక్కువగా యంగ్ హీరోలతో యాక్ట్ చేసింది. ప్రస్తుతం ఆమె చేతిలో రెండు ప్రాజెక్టులున్నాయి. ప్రతీక్ గాంధీ సరసన హో లడకీ హై కహాన్. ఇస్వాక్ సింగ్‌తో గాంధారీ చేస్తోంది బ్యూటీ. రీసెంట్లీ- గాంధారీ షూటింగ్ కంప్లీట్ చేసుకుంది. త్వరలో నెట్ ఫ్లిక్స్‌లో ప్రసారం కానుంది. మరీ బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉన్న తాప్సీ.. ఇక టాలీవుడ్ కు టాటా చెప్పేసినట్లేనా..అన్న ప్రచారం సాగుతోంది.

## దీపిక ముందు పెద్ద సవాల్!

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె గతేడాది ఆడపిల్లకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. కూతురి కోసం సినిమాలకు బ్రేక్ ఇచ్చిన దీపికా ప్రస్తుతం మాతృత్వాన్ని ఎంజాయ్ చేస్తోంది. అయితే ఇప్పుడు దీపికా తిరిగి మేకప్ వేసుకుని షూటింగుల్లో పాల్గొనేందుకు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో కూతురు పుట్టాక తన లైఫ్ లో వచ్చిన మార్పుల గురించి, షూటింగ్ లో పాల్గొనడం గురించి దీపిక ఓ ఇంటర్వ్యూలో మాట్లాడింది. లైఫ్ లో తల్లి అవడమనేది గొప్ప మధురానుభూతి అని చెప్తోన్న దీపికా, ప్రస్తుతం తాను ఆ అనుభూతిని ఆస్వాదిస్తున్నట్టు తెలిపింది. కూతురు పుట్టినప్పటి నుంచి బ్రేక్ లో ఉన్నానని, ఇప్పుడు మళ్లీ షూట్స్ కు రెడీ అవాలని, తన కూతురికి తల్లిగా తన బాధ్యతల్ని నిర్వర్తిస్తూనే మిగిలినవన్నీ చేయాలని దీపికా చెప్పుకొచ్చింది. ఈ విషయంలో ఎంతోమంది ఎన్నో సలహాలు, సూచనలు ఇస్తుంటారని, ఎవరెన్ని చెప్పినా ఇంత చిన్న వయసులో కూతురిని వదిలి మన పనిలో మనం బిజీ అవడం చాలా ఛాలెంజింగ్ గా ఉంటుందని, దీన్ని ఎలా ఫేస్ చేయాలా అని ఆలోచిస్తున్నానని, ఎలాగైనా ఈ ఫేజ్ ను ఎదుర్కొంటాననే నమ్మకం తనకు ఉందని దీపిక అంటోంది. అయితే ఈ ఎఫెక్ట్ తన సినిమాలపై కూడా ఉంటుందని, తాను బిడ్డకు జన్మనివ్వక ముందు కూడా కథల ఎంపికలో ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నానని, ఇప్పుడు కూడా అలాంటి జాగ్రత్తలే తీసుకుంటానని దీపిక తెలిపింది. ఇక సినిమాల విషయానికొస్తే రోహిత్ శెట్టి దర్శకత్వంలో వచ్చిన సింగం అగైన్ మూవీలో చివరిగా కనిపించిన దీపిక ఆ సినిమాలో చాలా పవర్‌ఫుల్ రోల్ లో కనిపించింది. దాంతో పాటూ కల్కి 2898ఏడీలో కూడా దీపికా పదుకొణె కీలక పాత్రలో నటించింది. ప్రస్తుతం కల్కి సీక్వెల్ కు సంబంధించిన వర్క్స్ జరుగుతుండగా, కల్కి2లో దీపిక పాత్ర చాలా కీలకం కానుంది.

Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463